నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
బుధవారం | మార్చి 12, 2025 | www.navatelangana.com

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులకు సమాచారం ఇవ్వాలి : కలెక్టర్



నవతెలంగాణ-కామారెడ్డి

అనధికార లే అవుట్లు, వ్యక్తిగత ప్లాట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని దరఖాస్తు దారులు సద్వినియోగ పరుచుకునే విధంగా సమాచారం అందించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. మంగళవారం కామారెడ్డి మునిసిపాలిటీ లో ఎల్.ఆర్.ఎస్. హెల్ప్ లైన్ డెస్క్ లను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, లే అవుట్లు, ప్లాట్ల రెగ్యులరైస్ చేసుకునేందుకు దరఖాస్తు చేసుకున్న వారికి ఫోన్ల ద్వారా సమాచారం అందించాలని తెలిపారు. మార్చి 31 వరకు ప్రభుత్వం కల్పిస్తున్న రిబేట్ గురించి విస్తృతంగా దరఖాస్తుదారులకు తెలిసే విధంగా ప్రచారం చేయాలనీ తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో ఎల్.ఆర్.ఎస్. పై ఏర్పాటుచేసిన కౌంటర్ లను కలెక్టర్ పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

మార్కెట్ యార్డులో నేడు, రేపు యధావిధిగా పసుపు తూకాలు



నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నిజామాబాద్ మార్కెట్ యార్డులో బుధ, గురువారాల్లో పసుపు పంట తుకాలు యధావిధిగా కొనసాగుతాయని మార్కెట్ కమిటీ కార్యదర్శి అపర్ణ తెలిపారు. సోమ, మంగళవారాల్లో అమ్మకాల నిమిత్తం మార్కెట్ యార్డుకు పెద్ద ఎత్తున పసుపు పంట నిల్వలు వచ్చాయని అన్నారు. బిడ్డింగ్ పూర్తయిన లాట్లకు బుధ, గురువారాల్లో తూకాలు జరుగుతాయని, బిడ్డింగ్ కాకుండా మిగిలిపోయిన పసుపు నిల్వలకు బిడ్డింగ్ ప్రక్రియ నిర్వహిస్తామని తెలిపారు. రైతులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.



మార్కెట్ యార్డుకు పెద్దఎత్తున తరలివచ్చిన పసుపు పంట

పసుపు విక్రయాలపై పకడ్బందీ పర్యవేక్షణ

- అదనపు కలెక్టర్‌కు పర్యవేక్షణ బాధ్యతలు
- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ మార్కెట్ యార్డ్ లో పసుపు పంట విక్రయాలపై గట్టి పర్యవేక్షణ జరుపుతున్నామని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పసుపు విక్రయాల సందర్భంగా రైతులకు ఏ దశలోనూ నష్టం వాటిల్లకుండా వారు మోసాలకు గురి కాకుండా జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు చేపట్టిందని తెలిపారు. పసుపు క్రయ విక్రయాల నిశిత పరిశీలనకై సంబంధిత శాఖల అధికారులను అప్రమత్తం చేశామని, క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ రైతుల ప్రయోజనాలకు భంగం వాటిల్లకుండా కృషి చేస్తారని పేర్కొన్నారు. అధికారులతో పాటు అదనపు కలెక్టర్ కూడా పర్యవేక్షణ బాధ్యతలు నిర్వర్తిస్తారని కలెక్టర్ స్పష్టం చేశారు. మార్కెట్ యార్డ్‌లో పసుపు పంట క్రయవిక్రయాలు సజావుగా జరిగేలా, రైతులకు మార్కెట్ డిమాండ్ కు అనుగుణంగా సరైన గిట్టుబాటు ధర అందేలా, సకాలంలో వారికి ట్రేడర్లు డబ్బులు చెల్లించేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ జరుపుతారని, రైతులు ఎలాంటి ఆందోళనకు గురి కావద్దని కలెక్టర్ సూచించారు. పసుపు పంట కొనుగోళ్లలో ఎవరైనా మోసాలకు పాల్పడుతూ రైతులకు నష్టం చేకూరేలా వ్యవహరిస్తే, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

బెల్ట్ షాప్‌పై పోలీసుల దాడి

నవతెలంగాణ స్పందన

- నవతెలంగాణ వరుస కథనాల నేపథ్యంలో ఎట్టకేలకు చర్యలు

నవతెలంగాణ-భిక్కనూర్



మండలంలోని జంగంపల్లి గ్రామంలో పోలీసులు బెల్ట్ షాపుపై మెరుపు దాడి నిర్వహించారు. పల్లె దావఖాన సమీపంలో బెల్ట్ షాప్ ఏర్పాటు చేసుకుని అక్రమ మద్యం అమ్ముతున్న కారణంగా పల్లె దావకాఖానలో విధులు నిర్వహిస్తున్న మహిళా వైద్య సిబ్బంది పడుతున్న ఇబ్బందులను నవతెలంగాణ దినపత్రికలో " మందు బాబులకు అడ్డాగా పల్లె దావఖాన', పర్మిట్ రూమ్.. పల్లె దావఖాన' శీర్షికలతో వరుస కథనాలు ప్రచురించిన విషయం విధితమే. దీంతో స్పందించిన పోలీసులు మంగళవారం బెల్ట్ షాప్ పై దాడి చేసి నిర్వాహకుడు నరేష్ గౌడ్ పై కేసు నమోదు చేసి, అక్రమంగా నిలువ ఉంచిన 24 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. మండలంలో ఎవరైనా అక్రమంగా మద్యం విక్రయిస్తే శాఖా పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ దాడిలో పోలీస్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

అడుగంటుతున్న ఆశలు

- చేతికందే దశలో ఎండుతున్న వరి
- మైదానాలను తలపిస్తున్న చెరువులు.. ఎత్తిపోతున్న బోర్లు
- పంటను కాపాడుకునేందుకు రైతుల పాట్లు
- కొన్ని చోట్ల వేలాది రూపాయలు వెచ్చిస్తూ వరికి ట్యాంకర్ నీరు
- అప్పులపాలయ్యే పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన

నవతెలంగాణ-నిజామాబాద్ డెస్క్/భీంగల్‌రూరల్

ఎన్నో ఆశలతో యాసంగిలో వరి సాగు చేపట్టిన రైతులకు.. పంట చివరి దశలో ఆందోళన తప్పడం లేదు. ఎండలు ముదురుతుండటంతో ఒకవైపు చెరువులు ఎండిపోతుండగా.. మరోవైపు భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. దీంతో బోరుబావిలు వట్టిపోతుండటంతో వరికి నీరు అందడం లేదు. కాలువల ద్వారాసైతం నీరు అందకపోవడంతో చివరి ఆయకట్టులోని పొలాలు ఎండిపోతున్నాయి. పొలాలు నెర్రెలు బారుతున్నాయి. మరో 20 రోజులు నీరు అందింతే తమ పొలాలు గట్టెక్కే అవకాశాలు ఉండటంతో నీటికోసం పరితపిస్తున్నారు. పలువురు రైతులు వేలాది రూపాయలు వెచ్చించి ట్యాంకర్‌ల ద్వారా నీటిని అందిస్తూ పంటను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు.

యసంగి సీజన్‌లో భాగంగా నిజామాబాద్ జిల్లా వాల్లా వ్యాప్తంగా సుమారు 4 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. కామారెడ్డి జిల్లాలో 2.3 లక్షలకు పైగా వరి సాగైంది. నిజాంసాగర్, శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టులు ప్రధాన నీటి వనరులు. కాగా కాలువలు లేని చోట బోరుబావుల మీద ఆధారపడి ఎక్కువ విస్తీర్ణం వరి సాగు చేస్తుంటారు. కాగా వరి పంట చేతికి వచ్చే సమయంలో రైతులకు సాగునీటి కష్టాలు వెంటాడు తున్నాయి. ఎండలు ముదురుతుండటంతో చెరువులు మైదానాలను తలపిస్తున్నాయి. భూగర్భ జలాలు అడుగంటు తుండటంతో బోరుబావులు ఎత్తిపోతున్నాయి.

ట్యాంకర్‌తో నీరు

నిజామాబాద్ జిల్లా భీంగల్ మండలం పిప్రి గ్రామానికి చెందిన పలువురు రైతులు పంటలను కాపాడుకునేందుకు భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. వేలాది రూపాయలు వెచ్చించి ట్యాంకర్‌ల ద్వారా నీటిని తెప్పించి వరిపొలాల్లో నింపుతున్నాయి. పక్కనే శ్రీరాంసాగర్‌ప్రాజెక్టు ఉన్నప్పటికీ అక్కడి నుంచి నీరు అందే అవకాశం లేకపోవడంతో ప్రధానంగా బోరుబావుల మీదనే ఆధారపడి వరిని సాగుచేస్తుంటారు. అయితే వేసవికి ముందే బోర్లు ఎత్తిపోతుండడంతో నీరందక పంటలు ఎండిపోతున్నాయి. దీంతో చివరి దశకు వచ్చిన పంటలను కాపాడుకునేందుకు వేలాదిరూపాయలు వెచ్చిస్తూ ట్యాంకర్ ద్వారా నీటిని తరలించుకుంటున్నారు. 20 రోజులైతే పంట చేతికొస్తుదన్న సమయానికి బోర్లలో నీరు ఎండిపోవడంతో మూడు రోజుల నుంచి రెండు ట్రాక్టర్ల ద్వారా నీటిని తెప్పించి పంటను రక్షించుకునేందుకు ప్రయత్నిస్తున్నామని భీంగల్ మండలం పిప్రి గ్రామానికి చెందిన వెన్నెల గణేష్, బెజ్జోరా రాజేశ్వర్, బడా భీంగల్ అశోక్ అనే రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోసారి నీటిని పెడితేనే పంట చేతికొచ్చే పరిస్థితి ఉందని, కానీ పెట్టుబడి అమాంతంగా పెరిగిపోతోందని వాపోతు న్నారు. ఒక్కో ట్యాంకర్‌కు రూ.900 నుంచి 1000 వసూలు చేస్తున్నట్టు సమాచారం. అర ఎకరానికి నీటిని పట్టేందుకు మడిలో నీరును బట్టి 8 నుంచి 10 ట్యాంకర్ల నీటిని పడుతున్నారు. నెర్రెలుబారిన చోట.. ట్యాంకర్‌తో నీటిని నింపి మరో ట్యాంకర్ వచ్చే లోగా అంతకుముందు పట్టిన నీరు ఎండిపోతుండటం గమనార్హం. దీంతో వేరే గత్యంతరం లేక రైతులు ఆశలు వదులుకుంటున్నారు.



రెంజల్ మండలంలో నీరు లేక వరి పొలంలో ఏర్పడ్డ నెర్రెలు

రెంజల్ మండలంలో సైతం బోరుబావుల కింద వేసి పంటలకు నీరందరక ఎండుముఖం పడుతున్నాయి. విడతల వారీగా అలీసాగర్ ఎత్తిపోతల పథకం ద్వారా వస్తున్న నీరు వీటికి అందుబాటులో లేకపోవడంతో బోరుబావులనే ఆశ్రయించాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. బోరు బావులను నమ్ముకొని పంట వేస్తే.. సగం ఎండుముఖం పడుతున్నట్టు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భూగర్భ జలాలు అడుగంటడంతో తాము తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితి తలెత్తిందని వాపోతున్నారు.


నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలి

ప్రతేడాది ఒక్కో సీజన్‌లో ఒక్కో సమస్యతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈసారి వర్షాకాలం సీజన్ పంట బాగా పండి చేతికి వస్తే.. సకాలంలో కొనుగోలు కేంద్రాలు తెరవకపోవడంతో ప్రయివేటు వ్యాపారులు తక్కువ ధరతో కొనుగోలు చేయడంతో నష్టపోయినట్టు రైతులు వాపోయారు. ఎన్నో ఆశలతో యాసంగి సాగు చేపట్టగా.. తీరా చేతికి వచ్చే సమయంలో ప్రస్తుతం ఎండుముఖం పడుతుండటంతో ఈసారి సైతం నష్టాలు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కామారెడ్డి జిల్లా దోమకొండలో సైతం బోరుబావుల కింద పంటలు ఎండుముఖం పడుతున్నాయి. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.





దోమకొండలో ఎండిన వరి పైరు..



భీంగల్ మండలం పిప్రిలో పంటను కాపాడుకునేందుకు ట్యాంకర్‌తో నీటిని తెచ్చిన రైతులు

అనుమతులు లేకుండా ఇటుక బట్టీలు నిర్వహిస్తే కేసు

- ఇటుక బట్టీలను తనిఖీ చేసిన తహసీల్దార్
- నవతెలంగాణ కథనానికి స్పందన

నవతెలంగాణ స్పందన

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్



అనుమతులు లేకుండా యథేచ్ఛంగా ఇటుక బట్టీల ఏర్పాటు అనే శీర్షికన సోమవారం నవతెలంగాణ దిన పత్రికలో ప్రచురితమైన కథనానికి పెద్ద కొడప్‌గల్ ఎమ్మార్వో దశరథ్ స్పందించి మంగళవారం ఇటుక బట్టీలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటివరకు తయారైన ఇటికలను అమ్మేసి ఇకపై ఇటుకలను తయారు చేయకూడదని ఆయన యజమానులను ఆదేశించారు. ఇటుక బట్టి నిర్వహించాలంటే మైన్స్ శాఖ నుండి, కార్మిక శాఖ నుండి, పర్యావరణ శాఖ నుండి అనుమతులు పొందిన తర్వాతే ఇటుక బట్టీలు నడిపించాలని అన్నారు. నిబంధనలను ఉల్లంఘించి అక్రమంగా ఇటుక బట్టిని నడిపిస్తే సీజ్ చేసి కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎమ్మార్వో వెంట ఆర్ఐ అంజయ్య ఉన్నారు.

చెరువు కోసం రాస్తారోకో

- లక్ష్మాపూర్ గ్రామస్తుల ఆందోళన



నవతెలంగాణ-వర్ని(చందూర్)

మండల కేంద్రంలో లక్ష్మపూర్ గ్రామ ప్రజలు లక్ష్మి సాగర్ చెరువు కోసం మంగళవారం రాస్తారోకో చేపట్టారు. గ్రామస్తుల వివరాల ప్రకారం.. లక్ష్మాపూర్ గ్రామ శివారులో గల లక్ష్మి సాగర్ చెరువు తమ పరిధిలో ఉందని అట్టి చెరువులో గ్రామస్తుల శిఖం భూములు కూడా ఉన్నాయని తెలిపారు. కానీ తమ పాత పంచాయతీలో విలీనమైన ఉన్న మేడిపల్లి తాండ కొత్తగా పంచాయతీ అయిన తరువాత ఆ గ్రామ ప్రజలు ఆ చెరువు వారిదని దౌర్జన్యం చేస్తున్నారని అన్నారు. గత కొన్ని ఏండ్ల నుంచి తమకు చెందిన చెరువును ఇప్పుడు మేడిపల్లి గ్రామ ప్రజలు ఒక కాంట్రాక్టర్ కు చేపలను వేలం వేసుకొని వలలు వేసి పట్టే ప్రయత్నంలో సోమవారం రాత్రి అడ్డుకోగా పోలీస్ అధికారులు వచ్చి మేము బాధ్యత అని చెప్పిన మరోసాటి రోజు కూడా ఆ తాండ ప్రజలు వినకపోవటంతో గ్రామ ప్రజలందరం కలసి మండల కేంద్రంలో రాస్తారోకో చేపట్టినట్లు తెలిపారు. సోమవారం రాత్రి పోలీస్ అధికారులు ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదని తమకు న్యాయం కావాలని, చెరువు కావాలని నినాదాలు చేశారు. రాస్తారోకో ఘటన స్థలానికి చేరుకొన్న సిఐ, వర్ని ఎస్ ఐ, రుద్రూర్ ఎస్ ఐ లు గ్రామస్తులను సముదాయించి ఆందోళన విరమింపజేశారు. అనంతరం రెండు గ్రామాల ప్రజలతో చర్చలు జరిపారు. వారం రోజులలో రెండు గ్రామాల ప్రజలతో చెరువు విషయంపై అధికారుల వద్ద చర్చలు చేద్దామని, అప్పటి వరకు ఆ చెరువు వైపు రెండు గ్రామాల ప్రజలు పోవద్దని పోలీసులు సూచించారు.

మహిళలు అన్ని రంగాలలో ఎదగాలి

- మహిళలపై దాడుల కట్టడికి మరిన్ని కఠిన చట్టాలు రూపొందించాలి
- పోరాటాలే కాకుండా మహిళలను చైతన్యవంతం చేయడంలో ఐద్వా ముందుంది
- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ పి.పద్మావతి
- ఐద్వా ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు




పలువురికి ఐద్వా ఆధ్వర్యంలో సన్మానం

నవతెలంగాణ-కంఠేశ్వర్

మహిళలు అన్ని రంగాలలో ఎదగాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ పి.పద్మావతి అన్నారు. మహిళలపై దాడుల నిరోధానికి మరిన్ని కఠిన చట్టాలు రూపొం దించాలని అన్నారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఐద్వా జిల్లా కార్యదర్శి సుజాత అధ్యక్షతనగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిధులుగా జిల్లా డిఎల్ఎస్ఏ సెక్రటరీ, అదనపు జడ్జి పి. పద్మావతి, ఉమెన్ చైల్డ్ వెల్ఫేర్ ఆఫీసర్ రసూల్ బీ, ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ బండారి సుజాత, ఇంటర్నేషనల్ గోల్డ్ మెడలిస్ట్ స్విమ్మర్ పూర్ణ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జ్ పి.పద్మావతి మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాలలో ఎదుగు తున్నారని అన్నారు. అదేవిధంగా ఐద్వా మహిళా సంఘం పోరాటాలే కాకుండా మహిళలను చైతన్య పరచడంలో ముందుంటుందని అభినందిం చారు. మహిళాలకు ఉన్న సమస్యలను జిల్లా న్యాయ సలహా సంస్థలకు తెలియజేస్తే వారి సమస్యలను పరిష్కరించడం కోసం కృషి చేస్తామని అన్నారు. మహిళలు చదువుల్లోనే కాకుండా పోరాటాలలో ముందుండాలని తెలిపారు.

గైనకాలజిస్ట్ డాక్టర్ బండారి సుజాత మాట్లా డుతూ.. మహిళలు స్వశక్తిగా ఎదగాలని, సొంత నిర్ణయాలు తీసుకునే విధంగా ఉండాలని హితవు పలికారు. టెక్నాలజీని అందపుచ్చుకొని మహిళా హక్కు లను తెలుసుకొని ప్రజలను చైతన్యం చేయాలని సూచించారు. ఉమెన్ వెల్ఫేర్ చైల్డ్ ఆఫీసర్ రసూల్ బి మాట్లాడుతూ.. మహిళల పై దాడులు జరిగితే సఖి సెంటర్ల ద్వారా అంగన్వాడీల ద్వారా సమా చారం అందించాలని అన్నారు. మహిళలకు సమస్య లు వస్తే ఈ టోల్ ఫ్రీ నంబర్లకు చైల్డ్ హెల్ప్ లైన్ 1098, సఖి హెల్ప్ లైన్ 181 సమాచారం అందిస్తే పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. అదేవిధంగా ఐద్వా ఇలాంటి సెమినార్లు అనేకంగా నిర్వహించి మహిళలలో చైతన్యం నింపాలని ఆకాంక్షించారు.

ఇంటర్నేషనల్ గోల్డ్ మెడలిస్ట్ స్విమ్మర్ పూర్ణ మాట్లాడుతూ ఆకాశంలో సగం అమ్మలో సగంగా మహిళలు అన్ని రంగాలలో ముందుంటున్నారని వారందరూ ఐక్యంగా వారి సమస్యలపై పోరాటాలు చేయాలని సూచించారు. అదేవిధంగా మహిళా దినోత్సవం సందర్భంగా ముఖ్య అతిథులతో పాటుగా మహిళా జర్నలిస్టులు సంగీత, సోనితో పాటు ఆర్టిజన్, అంగన్వాడీలను ఆశలను సన్మానించారు. మహిళా పోరాట యోధురాల్ల చరిత్రను తెలపడం కోసం రమాబాయి, సావిత్రి బాయి పూలే, ఝాన్సీ లక్ష్మీబాయి వేషధారణతో చిన్నారులు అలరించారు. ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి సిర్పలింగం బృందం పాటలు ఆకట్టుకు న్నాయి. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు అనిత , స్వర్ణలత రేణుకా, కలా, రేఖ, శ్రీదేవి, విమల, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.




హాజరైన వివిధ రంగాల మహిళలు

పసుపు రైతుల ఆందోళన కనిపించడం లేదా..?

కాంగ్రెస్, బీజేపీ హామీలు ఏమయ్యాయి..? : ఎమ్మెల్సీ కవిత

నవతెలంగాణ-కంఠేశ్వర్



నిజామాబాద్ పసుపు రైతుల ఆందోళనలు ప్రభుత్వానికి కనిపించడం లేదా ? అని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఆదుకోవడానికి ముందుకు రావడం లేదని మంగళవారం ఒక ప్రకటన విమర్శించారు. క్వింటాలు పసుపుకు రూ. 15 వేల మేర మద్దతు ధర కల్పిస్తామని ఎన్నికల సమయంలో రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. పసుపునకు కనీసం రూ.9 వేలు రాని పరిస్థితి ఉంటే, రాష్ట్ర ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించడానికి చర్యలు తీసుకోకపోవడం దారుణమని మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను మోసం చేస్తున్నాయని ఆరోపించారు. పసుపు బోర్డు తీసుకొచ్చామని చెబుతున్న బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ కనీసం రైతులను పరామర్శించడం లేదని పేర్కొన్నారు. ధరలు పెంచుతామని, మరిన్ని ప్రయోజనాలు కల్పిస్తామని పసుపు బోర్డు ప్రారంభోత్స వంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ ఇచ్చిన హామీ ఏమైందని? ప్రశ్నించారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం రూ. 15 వేల మద్దతు ధర చెల్లిస్తూ పసుపు పంటను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

నీటి లభ్యత ఆధారంగా పంటలు సాగు చేపట్టాలి

- ప్రస్తుతం వరి గట్టెక్కించేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు ఆలోచించాలి
- ధర్పల్లి, సిరికొండ మండలాల్లో ఎండుతున్న వరి పంటను పరిశీలించిన కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు



వరిపంటను పరిశీలిస్తున్న కలెక్టర్



నవతెలంగాణ-ధర్పల్లి

వచ్చే యాసంగి నుంచి సాగునీటి లభ్యత ఆధారంగా వరి పంటను సాగు చేపట్టాలని.. ఇందుకోసం రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు వ్యవసాయాధికారులకు సూచించారు. ప్రస్తుతం ఎండుముఖం పడుతున్న పంటలను గట్టెక్కించేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు చూడాలని చెప్పారు. ధర్పల్లి, సిరికొండ మండలాల్లోని ఆయా ప్రాంతాలలో ప్రస్తుత యాసంగిలో రైతులు సాగు చేస్తున్న వరి క్షేత్రాలను కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. బోరుబావుల కింద సాగవుతున్న వరి పైరు ఏ స్థితిలో ఉంది, సాగునీటి లభ్యత ఏ మేరకు అందుబాటులో ఉంది అన్న అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ధర్పల్లి మండలం చెరువుతండా శివారులో ఒడ్డేటి చిన్నసాయిలు, శోభన్ రాజు అనే రైతులకు చెందిన వరి పైర్లు పాక్షికంగా కొంత విస్తీర్ణంలో ఎండుముఖం పట్టడాన్ని గమనించిన కలెక్టర్, అందుకు గల కారణాలను వ్యవసాయ అధికారులను, సంబంధిత రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

కాగా, సాగునీటి విషయమై రైతుల్లో అవగాహన పెంపొందించాలని కలెక్టర్ వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. కనీసం వచ్చే యాసంగి సీజన్లో నైనా సాగునీరు వనరుల లభ్యతను బట్టి తగిన పంటలు వేసుకునేలా చైతన్యపరచాలని సూచించారు. ముఖ్యంగా బోరుబావులపైనే ఆధారపడి పంటలు పండిస్తున్న రైతులకు భూగర్భ జలాల పరిస్థితి గురించి వివరిస్తూ, రబీలో పూర్తి విస్తీర్ణంలో వరి పంట వేయకుండా ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకునేలా ప్రోత్సహించాలని అన్నారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగించుకునేలా చూడాలని, క్షేత్రస్థాయిలో రైతులకు అందుబాటులో ఉంటూ వారికి అవసరమైన సలహాలు, సూచనలు అందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజిద్ హుస్సేన్, ఏ.ఓలు బి.శ్రీనివాస్ రావు, వెంకటేష్, ఏ.ఈ.ఓ లక్ష్మిప్రసన్న, తహసీల్దార్ మాలతి తదితరులు ఉన్నారు.

కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులు పంపిణీ


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-పొతంగల్(కోటగిరి)

కోటగిరి మండలంలోని 56 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను బాన్సువాడ పట్టణ కేంద్రంలోని రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసనసభ్యులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి నివాసం వద్ద జరిగిన కార్యక్రమంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి మండలాల మార్కెట్ కమిటీ అధ్యక్షులు గైక్వాడ్ హన్మంతు, కోటగిరి మండల మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు శ్రీ అనిల్, వర్ని, చందూర్, కోటగిరి మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు,అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

డీపీవోను కలిసిన మాజీ ఎంపీపీ దంపతులు


డీపీవోకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మాజీ ఎంపీపీ దంపతులు

నవతెలంగాణ-ముప్కాల్

నిజామాబాద్ జిల్లా నూతన డీపీవోగా శ్రీనివాస్ రావ్ సోమవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మంగళవారం ముప్కాల్ మాజీ ఎంపీపీ సామ పద్మ-వెంకట్‌రెడ్డి దంపతులు పంచాయతీ అధికారి శ్రీనివాస్ రావ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తూ స్వాగతం పలికారు. అనంతరం మండలంలో ఉన్న సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగులో ఉన్న పలు అభివృద్ధి పనులు ముందుకు సాగేలా చూడాలని విజ్ఞప్తి చేశామన్నారు.

విద్యార్థులకు పరీక్ష అట్టలు, పెన్నులు వితరణ


విద్యార్థులకు అట్టలు, పెన్నులు అందజేసిన యోగ కమిటీ బృందం

నవతెలంగాణ-భీంగల్ రూరల్

మండలంలోని దేవక్కపేట్ గ్రామంలో భీంగల్ యోగ కమిటీ బృందం ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు పరీక్షలు రాసేందుకు అవసరమయ్యే పరీక్ష అట్టలు, పెన్నులు ఉచితంగా పంపిణీ చేశారు. యోగ గురూజీ పర్స అనంతరావు మాట్లాడుతూ.. ఈ మారుమూల ప్రాంతం నుంచి అందరు చాలా కష్టపడి, శ్రద్ధగా చదువుకుని మంచి ఉత్తీర్ణత సాధించాలని కోరారు. అన్ని రంగాలలో విజయం సాధించి తల్లిదండ్రుల ముఖంలో సంతోషం నింపాలని కోరారు. ప్రతిరోజు యోగ, ధ్యానం చేయడం వల్ల మానసికంగా, దృఢంగా ఉంటారని వివరించారు. ఈ కార్యక్రమానికి సహకరించిన యోగ బృందానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామాభివృద్ధి కమిటీ సభ్యుడు అజయ్, సేవాలాల్, కార్ల స్వామి, సాయిలు, శర్మన్, భీంగల్ యోగ బృందం క్రియాశీల సభ్యులు శివకుమార్, నవీన్, రాకేష్, పిట్ల బాపూరావు, పురస్తు లింబాద్రి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రేఖా, మోహన్, చిన్నరాజన్న, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు పంట రుణాల చెక్కులు పంపిణీ


రైతులకు చెక్కులు పంపిణీ చేస్తున్న సింగల్‌విండో చైర్మన్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని కోనసముందర్ సింగల్‌విండో కార్యాలయంలో మంగళవారం రెండో పరిధిలోని రైతులకు పంట రుణాల చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. విండో చైర్మన్ సామా బాపురెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఈ మేరకు రైతులకు పంట రుణాల చెక్కులను అందజేశారు. విండో పరిధిలోని గ్రామాలకు చెందిన 14 మంది రైతులకు రూ.16లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విండో చైర్మన్ సామాబాపురెడ్డి మాట్లాడుతూ రైతులు పంట రుణాలను సద్వినియోగం చేసుకొని ఉత్తమ సాగు దిగుబడులను సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు బండి నారాయణ, సిఈఓ కార్తీక్ కుమార్, విండో సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్‌పై 25శాతం రాయితీ

- భీంగల్ మున్సిపల్ కమిషనర్



రాయితీ పత్రాలను అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్

నవతెలంగాణ-భీంగల్ రూరల్

ఎల్ఆర్ఎస్‌పై 25శాతం రాయితీ ఇస్తున్నట్టు భీంగల్ మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్ తెలిపారు. 2020 సంవత్సరంలో ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ఎల్ఆర్ఎస్‌పై అవగాహనా సదస్సును ఏర్పాటు చేశారు. లేఅవుట్ క్రమబద్ధీకరణ పథకం(ఎల్ఆర్ఎస్) కింద దరఖాస్తుదారులకు రాయితీ ఇచ్చినా పెద్దగా స్పందన లేకపోవటంతో పథకంపై లబ్ధిదారులకు వివరించారు. ఈ నెలాఖరు వరకూ ఎల్ఆర్ఎస్ రాయితీ పథకం అమల్లో ఉంటుందని, ఎల్ఆర్ఎస్ ఫీజుపై 25 శాతం రాయితీని ఇవ్వనున్నట్టు తెలిపారు. ఎల్ఆర్ఎస్ చేసుకోవడం వల్ల కలిగే లాభాలను లబ్ధిదారులకు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు వివరించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఆలూర్ మైనారిటీ పాఠశాల విద్యార్థి ఎంపిక



నవతెలంగాణ-ఆర్మూర్

తెలంగాణ మైనారిటీ స్కూల్ ఆలూరు (ఆర్మూర్ బాయ్స్ 1) పాఠశాల 8వ తరగతి విద్యార్థి సయ్యద్ అనస్ 68వ స్కూల్ గేమ్స్ అండర్ 14 విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్ యోగేష్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారుడిని పిడి గోవింద్, పిఈటి శ్రీనివాస్ గౌడ్ తదితరులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించాలి

- వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి. యాదగిరి రావు



మాట్లాడుతున్న వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ యాదగిరి రావు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఎయిడ్స్‌తో నివసించే ప్రజలకు సహాయం అందించి వారికి నైతిక మద్దతు ఇవ్వాలని, అలాంటి వారిపై ఉన్న కళంకం, వివక్షను తగ్గించి ఆరోగ్యకరమైన బాధ్యతాయుతమైన జీవనశైలిని ప్రోత్సహించాలని వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి.యాదగిరి రావు పేర్కొన్నారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, తెలంగాణ వర్సిటీ ఎన్ఎస్ఎస్ సెల్ ఆధ్వర్యంలో యూనివర్సిటీ స్థాయి రెడ్ రిబ్బన్ క్లబ్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన తెలంగాణ వర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టీ.యాదగిరిరావు మాట్లాడుతూ.. ఎయిడ్స్‌తో నివసించే ప్రజలకు సహాయం అందించి వారికి నైతిక మద్దతు ఇవ్వాలని, ప్రాణాంతకమైన ఎయిడ్స్‌పై తెలంగాణ వర్సిటీ విద్యార్థులకు అవగాహన కల్పించడం అభినందనీయమైనదని పేర్కొన్నారు. ప్రధానంగా విద్యార్థులు తమ గ్రామంలో మురికివాడల్లో నివసించే ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కుటుంబ వ్యవస్థ పటిష్టంగా ఉండి మానవతా విలువలను పెంపొందించినట్టయితే సామాజిక రుగ్మతలు తగ్గుతాయని తెలిపారు. విశిష్ట అతిథిగా హాజరైన రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.యా దగిరి మాట్లాడు తూ.. ప్రభుత్వం ఒక సవాలుగా తీసుకొని గతంలో క్షయ వ్యాధిని పూర్తి గా నిర్మూలించిందన్నారు. యువత పూర్తి అవగాహ నతో మెదులుకుంటే ఎయిడ్స్ కూడా పూర్తిగా నిర్మూలించవచ్చని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మామిడాల ప్రవీణ్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ఫార్మా రంగం ఎంతో అభివృద్ధి చెందినదన్నారు. ప్రాణాంతకమైన అన్ని వ్యాధులకు మందులు అందుబాటులో ఉన్నాయని భారతదేశం ఆరోగ్య పరిశోధనల అభివృద్ధిపై దృష్టి సారించిందని పేర్కొన్నారు. ఎయిడ్స్ సోకిన వారిని చిన్న చూపు చూడకుండా మన శక్తి మేర అండగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ప్రొఫెసర్ రవీందర్‌రెడ్డి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ఎన్ఎస్ఎస్ సెల్ కార్యదర్శి నరసింహ గౌడ్, జిల్లా ఎయిడ్స్ ప్రాజెక్టు మేనేజర్ సుధాకర్, జిల్లా ఆరోగ్య ఎడ్యుకేటర్ జి.వెంకటేశ్వర్లు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ స్వప్న, డాక్టర్ ఐలేని మహేందర్, డాక్టర్ సంపత్, డాక్టర్ స్రవంతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఉపన్యాస, వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి.యాదగిరిరావు చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

పన్నులు చెల్లించి గ్రామాభివృద్ధికి తోడ్పడండి

- ఎంపిడిఓ శ్రీనివాస్ గౌడ్


మాట్లాడుతున్న ఎంపీడీవో

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండలంలోని అన్ని గ్రామపంచాయతీలో పేరుకుపోయిన ఇంటి పన్నులు చెల్లించి గ్రామ అభివృద్ధికి తోడ్పడాలని, తమ తమ గ్రామాలకు వచ్చే పంచాయతీ కార్యదర్శులకు సహకరించాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం నవతెలంగాణతో ఆయన మాట్లాడుతూ మండలం మొత్తంలోని టోటల్ డ్యూ రెండు కోట్ల నలభై లక్షలు ఉందని, నేటి వరకు ఒక కోటి 62 లక్షలు 68శాతం వసూలు చేసినట్టు వివరించారు. ఈనెల 25 వరకు 100శాతం పన్నులు వసూలు చేసే విధంగా ప్రతి గ్రామ పంచాయతీ కార్యదర్శులు, కారోబార్లో, బిల్ కలెక్టర్లు, పంచాయతీ సిబ్బంది అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. ఇంకా మిగిలిన రోజుల్లో అది పూర్తిచేసే బాధ్యత వారిపై ఉందన్నారు. ప్రతి పంచాయతీలో రోజు వసూలు చేసిన కలెక్షన్‌కు సంబంధించిన వివరాలను ఆన్లైన్లో పొందు పరచాలని ఆయన సూచించారు. ఇప్పటికే మండలంలోని అన్ని గ్రామాలలో పన్ను వసూళ్ల కోసం నాలుగు ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసినట్టు వివరించారు. గ్రామ ప్రజలు పన్నులను చెల్లిస్తేనే సిబ్బందికి వేతనాలు ఇవ్వవచ్చని తెలిపారు.

ఎల్ఆర్ఎస్ లబ్ధిదారులకు మంచి అవకాశం..

ఎల్ఆర్ఎస్ లబ్ధిదారులు ఇప్పటికే ఫీజును కట్టుకోనివారు ఈనెల 31 వరకు ఫీజు చెల్లించుకుని 25శాతం రిబేట్ పొందాలని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకోని వారు ఉంటే వారు కూడా ఆన్లైన్లో వెయ్యి రూపాయలు ఫీజు చెల్లించి ఆ రసీదును గ్రామపంచాయతీలో అందజేసి లబ్ధిపొందాలని ఈనెల 31 వరకు పూర్తి చేసుకునే విధంగా చూడాలని శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. 31లోపు దరఖాస్తు చేసుకుంటే వారికి మంజూరు లభిస్తుందని వివరించారు.

తెలంగాణ యూనివర్సిటీ పేరు మార్చొద్దు

- పిడిఎస్‌యూ ఆధ్వర్యంలో ధర్నా



నిరసన తెలుపుతున్న పిడిఎస్‌యు నాయకులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

'తెలంగాణ' అనే పదం ఉద్యమానికి ప్రతీక, చిరస్మరణీయమైన పేరును మార్చి ఈశ్వరి బాయి యూనివర్సిటీగా మార్చాలని చూడటం సరైంది కాదని పి.డి.ఎస్.యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ అన్నారు. మంగళవారం తెలంగాణ యూనివర్సిటీలోని ఆర్ట్స్‌అండ్‌సైన్స్ కళాశాల ముందు తెలంగాణ యూనివర్సిటీ పిడిఎస్‌యు కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జన్నారపు రాజేశ్వర్ మాట్లాడుతూ.. 1960 నుంచి 2014 వరకు సుదీర్ఘ చరిత్ర కలిగిన తెలంగాణ పేరును మార్చటం అంటే తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీయటమే నన్నారు. ఎంతో మంది త్యాగాలు, త్యాగాల గాయాలు, ఉద్యమ స్ఫూర్తి కలిగిన తెలంగాణ పేరును అలాగే ఉంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎవరు అధికారంలోకి వస్తే వాళ్ల తల్లిదండ్రుల పేర్లు ప్రభుత్వ సంస్థలకు పెట్టుకోవడం సరైన పద్ధతి కాదని విమర్శించారు. ప్రతి రాష్ట్రంలో ఆ రాష్ట్రం పేరుతో అనేక యూనివర్సిటీలు దేశంలో ఉన్నాయని, మన రాష్ట్రంలో ఏకైక యూనివర్సిటీకి తెలంగాణ అని పేరు ఉందని దీన్ని కూడా మారిస్తే చరిత్ర కలిగిన రాష్ట్రానికి అవమానకరమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం యునివర్సిటీ పేరు మార్చే ఆలోచనను విరమించుకో వాలని కోరారు. లేని పక్షంలో తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాల్సి వస్తుందని హెచ్చరించారు. జిల్లా అధికార పార్టీ ప్రజాప్రతినిధులు వెంటనే దీనిపై స్పందించి పేరు మార్చకుండా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టీయూ పి.డి.ఎస్.యూ నాయకులు ప్రిన్స్, హుస్సేన్, సాయికిరణ్, ఆకాష్, రమ్య, ప్రవీణ, రాజు, లావణ్య సరిత, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

పక్షుల రక్షణ కోసం 'బర్డ్స్ వాటర్ ఫీడర్స్' తయారు చేసిన విద్యార్థులు


బర్డ్స్ వాటర్ ఫీడర్స్‌ను తయారు చేసిన విద్యార్థులు

నవతెలంగాణ-ముప్కాల్

మండలంలోని రెంజర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు పక్షుల రక్షణ కోసం 'బర్డ్స్ వాటర్ ఫీడర్స్'ను తయారు చేసినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవి కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా నీటి ఎద్దడి వల్ల అనేక రకాల పక్షులు మృత్యువాత పడే అవకాశం ఉందని అన్నారు. జీవ వైవిదాన్ని పెంపొందించే ప్రయత్నంలో భాగంగా తమ పాఠశాల విద్యార్థులు ఖాళీగా పడివున్న ప్లేట్స్, జియో వైరును ఉపయోగిస్తూ 25 'బర్డ్స్ వాటర్ ఫీడర్స్'ను తయారు చేశారని తెలిపారు. పాఠశాల ఆవరణలో, గ్రామంలో అక్కడక్కడా ఈ బర్డ్స్ వాటర్ ఫీడర్స్‌ను చెట్లకు వేలాడదీస్తూ ఏర్పాట్లు చేశారని వివరించారు. దీనివల్ల పక్షులను కొద్దిమేరకైనా కాపాడుకోగల్గుతామన్నారు. పాఠశాల విద్యార్థులను అధ్యాపక బృందం, స్థానిక గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం


విద్యార్థులకు బిస్కెట్ ప్యాకెట్లు అందజేత

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్, బాల్కొండ లయన్స్ క్లబ్, స్థానిక పోలీసు శాఖ సిబ్బంది సంయుక్తంగా కలిసి మంగళవారం మధ్యాహ్న భోజనం సమయంలో ముప్కాల్ మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాల అధ్యాపక బృందాన్ని ఘనంగా సన్మానించారు. అదేవిధంగా విద్యార్థులకు బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఎస్సై తొగర్ల సురేష్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో మగవారికి ధీటుగా మహిళలు సైతం అన్ని రంగాల్లో రాణిస్తుండడం గర్వించదగ్గ విషయమన్నారు. పాఠశాల విద్యార్థినిలు ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రులకు, పుట్టిన ఊరుకు పేరు ప్రఖ్యాతులు తేవాలని సూచించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు, పోలీసు సిబ్బంది, పాఠశాల అధ్యాపక బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బాడీ ఫ్రీజర్ వితరణ


డెడ్ బాడీ ఫ్రీజర్ అంతజేత

నవతెలంగాణ-ఆర్మూర్(వేల్పూర్)

మండలంలోని జానకంపేట గ్రామంలో జేమ్స్ గంగారెడ్డి గ్రామ ప్రజల సౌకర్యార్థం డెడ్ బాడీ ఫ్రీజర్‌ను మంగళవారం వితరణ చేశారు. ఈ సందర్భంగా జానకంపేట్ గ్రామ తాజా మాజీ సర్పంచ్ సోడా రమేష్ మాట్లాడుతూ.. జేమ్స్ గంగారెడ్డి తండ్రి స్వర్గీయ గాదేపెల్లి మల్లేష్, మేనమామ స్వర్గీయ పోచంపల్లి రాజన్న జ్ఞాపకార్థం ఫ్రీజర్‌ను జానకంపేట్ గ్రామానికి వితరణ చేశారు. కార్యక్రమంలో దాత జేమ్స్ గంగారెడ్డి, ఆర్మూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రంగు అనిల్ గౌడ్, తాజా మాజీ సర్పంచ్ సొడ రమేష్, తాజా మాజీ ఎంపీటీసీ సొడ చందన్, తాళ్ల పద్మారావు, సొడ శ్రీనివాస్, జైరాజ్, కొలిప్యాక శ్రీనివాస్, శోభన్, తలారి శేఖర్, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అంక్సాపూర్ పాఠశాలలో మహిళా దినోత్సవ వేడుకలు


మహిళలను సన్మానించిన పలువురు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

వేల్పూర్ మండలంలోని అంక్సాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం వేడుకలను నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్.మల్లీశ్వరి అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మాదిరి అన్నపూర్ణ స్మారక ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షులు ఎం.రాజన్న హాజరై మాట్లాడారు. మహిళలు సమాజంలో అన్ని రంగాల్లో ముందుండాలని కోరారు. పాత రోజులకు, ప్రస్తుతం ఉన్న రోజులకు చాలా తేడా వచ్చిందని తెలిపారు. అన్నిరంగాల్లో మహిళలు ముందుండి దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కోరారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల మహిళ ఉపాధ్యాయులను, అంగన్వాడీ ఉపాధ్యాయులను, ఆయమ్మలను, ఆశ వర్కర్లను, పాఠశాలలో వంటచేసే వారిని దాదాపుగా 25 మందిని సొంత ఖర్చుతో రాజన్న శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రవిచందర్, సునీత, రఘునాథ్, శ్రీదేవి, శ్రీలక్ష్మి, రాజేంద్ర, కాంతయ్య దామోదర్ గౌడ్, యమునా, దేవరాజు, వేణుగోపాల్ రెడ్డి, అంగన్వాడి ఉపాధ్యాయులు, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన నాయకులు


కాంగ్రెస్‌లో చేరిన పలువురు నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

మాక్లూర్ మండలంలోని బోర్గాం గ్రామానికి చెందిన 50 మంది వివిధ పార్టీలకు చెందిన సీనియర్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి వినయ్ కుమార్ రెడ్డి సమక్షంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వినయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నో కార్యక్రమాలు పేదల సంక్షేమం కోసం, అభివృద్ధి కోసం పాటుపడుతున్నదన్నారు. కాంగ్రెస్ పేదల పక్షపాతి అని కాంగ్రెస్ పార్టీ వల్లే న్యాయం జరుగుతుందని వ్యాఖ్యానించారు. పీఏసీఎస్ చైర్మన్ ముల్లంగి అశోక్, ఇతర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

చేపూర్ మాదిగ పెద్ద సంఘానికి నిధులు ఇవ్వాలి..

మండలంలోని చేపూర్ గ్రామానికి చెందిన మాదిగ పెద్ద సంఘం సభ్యులు కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు చిన్నారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి పివిఆర్ భవన్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. తమ సంఘానికి నిధులు ఇప్పించాలని వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో రెండు రోజుల జైలు శిక్ష

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని ఐదవ పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు రోజుల జైలు శిక్ష పడిందని ఐదవ పోలీస్ స్టేషన్ ఎస్ఐ గంగాధర్ తెలిపారు. ఎస్సై గంగాధర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఐదవ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించగా శివాజీనగర్‌కు చెందిన సూర్య భీమ్‌రావు అనే వ్యక్తి మద్యం తాగి పట్టుబడ్డట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి రెండవ క్లాస్ మెజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా సూర్య భీమ్‌రావుకు రెండు రోజుల జైలు శిక్ష విధించారని ఎస్సై గంగాధర్ తెలియజేశారు.

మండల స్పెషల్ ఆఫీసర్‌గా ప్రమీల

నవతెలంగాణ-నిజాంసాగర్

నిజాంసాగర్ మండల స్పెషల్ ఆఫీసర్ గా కామారెడ్డి జిల్లా వెల్ఫేర్ అధికారి ప్రమీల నియమితులయ్యారు. ఆమె మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను, ఎస్సీ సోషల్ వెల్ఫేర్ అచ్చంపేట్ పాఠశాలలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఉపాధ్యాయులకు ఆదేశించారు. ఆమె వెంట మండల పరిషత్ అభివృద్ధి అధికారి గంగాధర్, ఏపీవో శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న స్పెషల్ ఆఫీసర్

వీధులు శుభ్రంగా ఉంచాలి

నవతెలంగాణ-తాడ్వాయి

వీధులు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని మండల ప్రత్యేక అధికారి రాజారాం అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని వీధుల గుండా పర్యవేక్షణ చేసి మాట్లాడారు. మురికి కాలువలను ఎప్పటికప్పుడు తీసి నిలువ లేకుండా డంపింగ్ యార్డ్ కు నిత్యం తరలించాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. కాల్వల్లో దుర్వాసన వచ్చినట్లయితే బ్లీచింగ్ పౌడర్ వేయించాలని సూచించారు. మండల కేంద్రంలో తాగునీటి నల్లలకు కరెంటు మోటార్లు బిగిస్తే చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బాలు, గంగారం సిబ్బంది పాల్గొన్నారు.


పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి

ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణ గడువు మార్చి 31

నవతెలంగాణ-గాంధారి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకముగా ప్రవేశ పెట్టిన ఎల్ఆర్ఎస్ 2020 లో దరఖాస్తు చేసుకున్నటువంటి (ఇంటి స్థలముల యజమానులకు) క్రమబద్ధీకరణ ఎల్ఆర్ఎస్ రుసుము 25 శాతం తగ్గింపుతో చివరి గడువు ఈ నేల 31వ తేదీ వరకు ఉందని జీపీ కార్యదర్శి నాగరాజు తెలిపారు. గాంధారి మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కావున ఈ అవకాశాన్ని వినియోగించుకొని ప్లాటును క్రమబద్ధీకరించుకోగలరని పంచాయతీ కార్యదర్శి నాగరాజు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్‌ల పట్టివేత


పట్టుకున్న ఇసుక ట్రాక్టర్స్

నవతెలంగాణ-నిజాంసాగర్

మండ లంలోని అచ్చంపేట్ గ్రామంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న 5 ట్రాక్టర్లను పట్టుకొని పోలీస్ స్టేషన్ కు తరలించినట్టు నిజాంసాగర్ ఎస్సై శివకుమార్ తెలిపారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను అక్రమ రవాణా చేస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోనున్నట్టు హెచ్చరించారు.

మూడు గ్రామాల్లో మద్యం విక్రయం నిషేధం

- విక్రయిస్తే జరిమానా.. గ్రామస్తుల తీర్మానం

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలంలోని ఆయా గ్రామాలలో మద్యం విక్రయించరాదని గ్రామస్తులు తీర్మానం చేశారు. లింగంపేట్ మండలంలోని కోమటిపల్లి, కేసాయిపేట, అన్నా రెడ్డిపల్లి గ్రామాలలో గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు గ్రామస్తులు గ్రామ పెద్దలు కుల సంఘాల పెద్దలు మద్య నిషేధంపై సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం అందరి అభిప్రాయాలను అడిగి తెలుసుకుని. గ్రామంలో మద్యము విక్రయించరాదని ఇకనుండి మద్యం విక్రయించినట్లయితే విక్రయించిన వారికి 50 వేల రూపాయల జరిమానా విధిస్తామన్నారు.అల్లురమ్మ ఆలయం సమీప ప్రాంతాల్లో ఊర చెరువు ప్రాంతాల్లో సాయంత్రం వేళ రోడ్డు ఇరువైపులా మద్యం సేవించరాదు అని తీర్మానం చేశా రు. ఈ తీర్మానం శుక్రవారం నుండి అమలవుతుందని గ్రామస్తులు సహకరి ంచాలని వారు కోరారు. మద్యానికి బానిసై ఎంతోమంది అప్పుల పాలై ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయిని అన్నారు. మూడు గ్రామాల్లో మద్యం విక్రయించరాదని చేసిన తీర్మానం పత్రాన్ని సంబంధిత లింగంపేట్ పోలీ సులకు, ఎల్లారెడ్డి ఎక్సైజ్ శాఖ అధికారులకు అందజేయనున్నట్టు తెలిపారు.

శుభ్రత పాటిస్తూ వంట చేయాలి

- ఏజెన్సీలకు సూచించిన ప్రత్యేక అధికారి రాజారాం

నవతెలంగాణ-తాడ్వాయి


వంట గది పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి

శుభ్రత పాటిస్తూ వంట చేయాలని మండల ప్రత్యేక అధికారి రాజారాం అన్నారు. ఆయన మంగళవారం బాలికల గురుకుల పాఠశాల సంద ర్శించి వంట గదులను పరిశీలిస్తూ వంట పాత్రలు ఒకటికి రెండుసార్లు కడిగి వంట చేయాలని అన్నారు. వంట గది ప్రాంతంలో మురికి లేకుండా శుభ్రత పాటించాలని సూచించారు. ఎప్పటికప్పుడు తెచ్చిన ఆకుకూరలు కూరగాయల తో వంట చేయాలని పూర్తిగా ఉడికిన గుడ్లనే అందించాలన్నారు. అనంతరం కస్తూర్బా పాఠశాలను సందర్శించారు. తదనంతరం కృష్ణజివాడిలో చేస్తున్న ఉపాధి పనులను పరిశీలించారు. కూలీల సంఖ్య మరింత పెంచే బాధ్యత ఈజీఎస్ సిబ్బందిదేనని పనులు చేస్తున్న ప్రాంతంలో తాగునీరు అందుబాటులో ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి సయ్యద్ సాజిద్ అలీ, ఈజీఎస్ సిబ్బంది, ప్రిన్సిపాల్ బి సురేఖ, ఉమారాణి, కస్తూర్బా గాంధీపాఠశాల ప్రిన్సిపాల్ రాణి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్ మండల స్పెషల్ ఆఫీసర్‌గా రామ్మోహన్


స్పెషల్ ఆఫీసర్‌ను సన్మానిస్తున్న ఎంపీడీవో, పంచాయతీ అధికారి

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండల స్పెషల్ ఆఫీసర్‌గా రామోహన్ డిసిఓ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మండలంలో జరిగే ఉపాధి హామీ పనులలను, నర్సరీనీ, కస్తూర్బా గాంధి బాలికల పాఠశాల, ఎస్సీ బాలికల హాస్టల్‌ను పర్యవేక్షించారు. మండల స్పెషల్ ఆఫీసర్‌గా బాధ్యతలు తీసుకున్న రామ్మోహన్ కు మండల ఎంపీడీవో రాణి మండల పంచాయతీ అధికారి వెంకట నరసయ్య ఇతర అధికారులు ఘనంగా సన్మానించారు.

నేడు ఎమ్మెల్యే రాక

నవతెలంగాణ-నిజాంసాగర్

మండలంలోని సుల్తాన్ నగర్ గ్రామంలో పైలెట్ ప్రాజెక్టు కింద చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ భూమి పూజ కార్యక్రమానికి బుధవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మి కాంతారావు హాజరవుతారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఎలె మల్లికార్జున్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరని ఆయన కోరారు.

మహిళా సంఘాలు జీవనోపాధితో ఆర్థికంగా ఎదగాలి

- డీపీఎం రమేష్ బాబు

నవతెలంగాణ-లింగంపేట్

ప్రతి మహిళా సంఘాలు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న సంఘాలు జీవన ఉపాధి పై ఆసక్తి చూపాలని తద్వారా ఆర్థికంగా ఎదగాలని డిపిఎం రమేష్ బాబు మహిళలకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎల్లారెడ్డి, గాంధారి, లింగంపేట్ మండలాలకు చెందిన ఎస్పి సీపీ సీఆర్పీగా పని చేయడానికి మహిళలకు రాత పరీక్షలను నిర్వహించారు. అనంతరం మహిళా సంఘాలతో గ్రూప్ డిస్కషన్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మహిళ గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సంఘాలు జీవన ఉపాధిపై ఆసక్తి చూపి ఆధారపడాలన్నారు. ప్రతి సంఘం ఆర్థికంగా బలపేతమవుతుందన్నారు. మహిళా సంఘాలు జీవనోపాధి కోసం కుటీర పరిశ్రమలు కిరాణా షాపులో హొటల్స్ ఎంటర్ప్రైజెస్ తదితర వ్యాపార రంగంలో ఆసక్తి చూపాలన్నారు. కుల వృత్తులు ఆదాయం వచ్చే మార్గాలు ఎంచుకోవాలన్నారు. సంఘ సభ్యులు జీవన ఉపాధి కోసం కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. జిల్లాలో జీవన ఉపాధి మెరుగుపరచడానికి మూడు మండలాలను ఎంపిక చేసినట్టు తెలిపారు. ప్రతి మండలానికి కార్యక్రమం నిర్వహణ కు పది మందిని ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

కార్యక్రమం నిర్వాహనకు ప్రత్యేకంగా ఏపిఎం రాజేందర్‌ను ఏర్పాటు చేశామన్నారు. సంఘాలు ఆర్థికంగా ఎదగడానికి ఎంతో దోహదపడుతుందన్నారు. మూడు మండలాల నుండి 65 మందిని అభ్యర్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో లింగంపేట ఏపిఎం శ్రీనివాస్, ప్రసన్న రాణి, గంగరాజు, మూడు మండలాల చెందిన మహిళలు మండల సమైక్య అధ్యక్షురాలు గ్రామ సంఘాల అధ్యక్షురాలు తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న డీపీఎం రమేష్ బాబు

పంట నిలిచేలా నీటిని కాపాడుతూ పారించాలి

- రైతు వేదికలో రైతునేస్తం

నవతెలంగాణ-రామారెడ్డి

మండల కేంద్రంలోని రైతు వేదిక లో మంగళవారం రైతు నేస్తం కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు. జిల్లా అధికారి తిరుమల ప్రసాద్ మాట్లాడుతూ.. వరి పంటలో నీటి యాజమాన్యం, నీరు అందినంత వరకు పంట విస్తీర్ణం నిర్ణయం తీసుకుని నీరు పెట్టాలని సూచించారు. వరి పంటకు నీరు పూర్తిగా కొనసాగించి కుడా రెండు మూడు రోజులకు ఒకసారి పెడితే ఈ యాసంగి వరి పంట నిలుస్తుందని తెలిపారు. రాబోయే రోజుల్లో గ్రౌండ్ వాటర్ పూర్తిగా తగ్గి పోయే అవకాశం ఉంది కాబట్టి బోర్లు వేసి రైతులు నష్టపోవద్దని తెలిపారు. వరి పంట బదులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్, ఎల్లారెడ్డి డివిజన్ ఏడిఏ రత్న, ఎఓ భాను శ్రీ , ఏఇఓలు శ్రీనివాస్, రాకేష్, నిఖిత, రాణి పాల్గొన్నారు.


రైతునేస్తంలో పాల్గొన్న అధికారులు, రైతులు

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం


సీసీ రోడ్లను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండలంలోని అవల్ గావ్ గ్రామంలో మంగళవారం ఉపాధి హామీ కింద మంజూరైన పది లక్షల తో సీసీ రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభమయ్యాయి. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు, దరాస్ వార్ సాయిలు, ఆధ్వర్యంలో పనులు ప్రారంభించారు. త్వరలోనే గ్రామభివృద్ధి కి ఇంకా కొన్ని పనులు ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ కొండ వార్ గంగాధర్ , అవల్ గావ్ కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు, ప్రమోద్ పాటిల్, మాజీ సర్పంచ్ బోండ్ల వార్ మారుతీ, ఉపసర్పంచ్ కీసర్ వార్ మారుతీ, గ్రామ పెద్దలు, సదాశివ్ పాటిల్, మరియు వినోద్ పాటిల్, అమూల్, రవి, దత్తప్ప, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను ప్రేమతో చూడాలి


మాట్లాడుతున్న డిఎల్ఎస్ఏ జడ్జి టి.నాగమణి

నవతెలంగాణ-సదాశివనగర్

మండల కేంద్రంలో మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ పురస్కరించుకొని సాధన స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని గ్రామ సంఘాలు మహిళలకు చైల్డ్ మ్యారేజ్ చైల్డ్ లేబర్ గురించి డి ఎల్ ఎస్ ఏ జడ్జి టి నాగమణి వివరించారు. చిన్నపిల్లలను ప్రేమతో చూడాలని ఆమె సూచించారు. మహిళలు అన్ని రంగాల్లో ముందు ఉండాలని, ఆడ మగ అని తేడా లేకుండా అందర్నీ సమానంగా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ గంగాసాగర్, ఎంపీడీవో సంతోష్ కుమార్, ఎంఈఓ యూసఫ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘం అభివృద్ధి కోసం కృషిచేయాలి

నవతెలంగాణ-దోమకొండ

మండల కేంద్రంలో ఐకెపి కార్యాలయంలో, మండల మహిళా సంఘం నూతన అధ్యక్షులుగా అబ్రబోయిన భూలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా స్వప్న, కోశాధికారిగా శారద ఎన్నికైన సందర్భంగా మాజీ జెడ్పిటిసి తిరుమల గౌడ్ శాలువాతో సన్మానం మంగళవారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... మహిళా సంఘం సభ్యులు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని కోరారు.ఈ కార్యక్రమంలో మహిళా సంఘం సభ్యులు ,తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో అక్రమ పిడిఎస్ బియ్యాన్ని సివిల్ సప్లై డీ.టీ కిష్టయ్య, పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. తిప్పాపూర్ గ్రామ శివారు యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన శ్రీనివాస్ అనే వ్యక్తి పిడిఎస్ బియ్యం తక్కువ ధరకు కొని ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లు సమాచారం మేరకు పట్టుకొని పరిశీలించగా అతని వద్ద 18 రైస్ బ్యాగులు 4.83 క్వింటాళ్ల బియ్యం లభించగా వాహనాన్ని సీజ్ చేసి వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మండలంలో ఎవరైనా అక్రమ పీడీఎస్ బియ్యం తరలిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని ఎస్సై ఆంజనేయులు హెచ్చరించారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలి


మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-దోమకొండ

మహిళలు అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే వెంకటరమణ రెడ్డి అన్నారు. దోమకొండ మండల పరిషత్ కార్యాలయం వద్ద ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ను మంగళవారం ప్రారంభించారు. ప్రభుత్వం మహిళా సంఘాల అభివృద్ధికి కృషి చేస్తుందని, మహిళ సంఘం రుణాలు సద్వినియోగం చేసుకోని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలన్నారు. మహిళా సంఘం సభ్యుల ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను అభివృద్ధి పథంలో ముందుకు సాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిడి సురేందర్, డిపిఎం సుధాకర్, ఎంపీడీవో ప్రవీణ్ కుమారు, బిజెపి పార్టీ మండల అధ్యక్షుడు భూపాల్ రెడ్డీ, ఏపిఎం రాజు, మహిళ సంఘం సభ్యులు, పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు ఆందజేత


చెక్కులు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ- రామారెడ్డి

మండల కేంద్రంలో మంగళవారం ముఖ్యమంత్రి సహాయ నిధి కింద పలువురి బాధితులకు మంజూరైన రూ3,94,500 విలువ గల చెక్కులను లబ్ధిదారులకు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లక్ష్మా గౌడ్, నామాల రవి, తూర్పు రాజు, శీల సాగర్, రంగు రవీందర్ గౌడ్, జెసిబి శేఖర్, రూఫ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

దొంగతనాలు, రోడ్డు ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలి

- ఏఎస్పీ చైతన్య రెడ్డి


పోలీస్‌లతో మాట్లాడుతున్న ఎఎస్పీ

నవతెలంగాణ-భిక్కనూర్

దొంగతనాలు, రోడ్డు ప్రమాద నివారణకు చర్యలు చెపట్టాలని ఎఎస్పీ చైతన్య రెడ్డి తెలిపారు. మంగళవారం భిక్కనూర్ పట్టణ కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ను సందర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పెండింగ్ కేసులను పరిశీలించారు. గ్రామ పోలీస్ సిబ్బందితో మాట్లాడి గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. మండల పరిధిలో పెట్రోలింగ్ పెంచి దొంగతనాలు జరుగకుండా చూడాలని, పెండింగ్లో ఉన్న కేసులను వెంటనే పరిష్కరిం చాలన్నారు. కేసుల పరిశోధనలో సాంకేతికతను వినియో గించాల న్నారు. ఈ కార్యక్రమంలో సిఐ సంపత్ కుమార్, ఎస్సై ఆంజనేయులు, పోలీస్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

ఆపన్న హస్తం కోసం ఎదురుచూపు

- బాలుడికి దెబ్బతిన్న రెండు కిడ్నీలు

నవతెలంగాణ-పిట్లం



పని చేస్తే గాని పూట గడవని పరిస్థితి. ఆర్థిక స్థోమత అంతంతే కుటుంబం ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తుంది. పిట్ల మండల కేంద్రానికి చెందిన బుడగ జంగం కాలనీకి చెందిన మిరియాల చిరంజీవి కుమారుడు అరవింద్ (12) అతి చిన్న వయసులోనే రెండు కిడ్నీలు చెడిపోవడంతో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతు న్నాడు. మెరుగైన సూదులు, మందుల నిమిత్తం ప్రస్తుతానికి 2 లక్షల 50 వేల రూపాయలను ఇతరాత్ర వారి దగ్గర అప్పుచేసి తన కుమారునికి ఖర్చు చేసినట్లు బాధితుడు మిరియాల చిరంజీవి తెలిపారు. ప్రస్తుతం డబ్బుల కోసం ఎక్కడ అవకాశాలు లేవని, తన బాలుడి ప్రాణాలు కాపాడడానికి ఎవరైనా దాతలు ముందుకు వచ్చి సహాయమందిస్తే తమ కుమారుడి కిడ్నీ సమస్యలు మెరుగుపడేలా ప్రాణబిక్ష పెట్టాలని కన్నీటి పర్యంతమవుతున్నారు. దాతలు ఎవరైనా ఉంటే 95506 57480 నెంబర్‌ను సంప్రదించగలరు.

రామ్ రామ్ మహారాజ్ మార్గం అనుసరనీయం

- బంజారాల హోలీ లెంగి ఉత్సవాల్లో ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండల కేంద్రంలో బంజారా యువజన సంఘం ఆధ్వర్యంలో బంజారాల హెూలీ లెంగి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. జగదాంబ మాత, సేవలాల్ మహారాజ్ గుడి సమీపంలో బంజారా సాంప్రదాయ నృత్యమైన హెూలీ లెంగీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ గిరిజన సాంప్రదాయ దుస్తులు ధరించి, గిరిజనుల తో కలిసి పాటలకు నృత్యం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్ మోహన్ మాట్లాడుతూ, మహాశివరాత్రి నుండి దాదాపు 15 రోజులు పౌర్ణమి ఉపవాస దీక్షతో జరుపుకునే లింగీ పండుగలో పాల్గొనడం ఆనందకరమని తెలిపారు. గిరిజనులు ప్రతి ఒక్కరూ రామ్ రామ్ మహారాజ్ సూచించిన మార్గంలో నడుచుకోవాలని ఆయన సూచించారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ మాట్లాడుతూ గిరిజనులు ప్రతి ఒక్కరూ ఒక పూట ఉపాసం ఉన్నా సరే కానీ పిల్లలకు మంచి విద్యాబుద్ధులు నేర్పించాలని విద్యతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని అన్నారు ఈ కార్యక్రమంలో గాంధారి మాజీ జెడ్పిటిసి సభ్యుడు శంకర్ నాయక్, మాజీ ఎంపీపీ రాధా బల రాం, లంగీ నిర్వహణ కమిటీ చైర్మన్ బొట్టు మోతిరాం, రాష్ట్ర బంజార సంగం అధ్యక్షులు తాన్ సింగ్ నాయక్ , మాజీ ఎంపీపీ కిషన్ నాయక్, ఎల్లారెడ్డి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సర్దార్ నాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు మోహన్‌నాయక్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు బంజారా సంఘం నాయకులు, మండలంలోని అన్ని గ్రామాల బంజారా పెద్దలు యువజన సంఘాల నాయకులు యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కష్టసుఖాల్లో తోడుంటామని చెప్పడమే హెూలీ లెంగి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మోతీరాం నాయక్


వేడుకల్లో పాల్గొన్న సీపీఐ(ఎం) నాయకులు

నవతెలంగాణ-గాంధారి

హెూలీ పండుగ అనేది గిరిజనుల్లో వారం పది రోజులు ప్రతి తండాలో ఆటలాడుతూ పాట పాడుతూ హెూలీనివ్ అనేక పదాలతో వర్ణిస్తూ కష్టాలు సుఖాల్లో తోడుండాలని కోరుతూ చెప్పుకుంటారని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మోతీరాం నాయక్ తెలిపారు. గాంధారి మండల కేంద్రంలో గిరిజనుల సాంస్కృతిక సంబరాలు భాగంగా హెూలీ లెంగి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మహిళలు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటారని, కష్టాలను మరిచిపోవడం కోసం సంతోషాలతో కుటుంబాలు సుఖ సౌభాగ్యాలతో ఉండటం కోసం హెూలీ పండుగను నిర్వహించుకుంటారని తెలిపారు. అందుకనే ప్రతి సంవత్సరం గాంధారి మండల కేంద్రంలో నిర్వహించుకుంటున్న గిరిజన సాంస్కృత సంబరాల్లో సీపీఐ(ఎం)గా అండగా ఉంటదని తెలిపారు. భూమికోసం భుక్తి కోసం గిరిజనుల చట్టాల కోసం సాంస్కృతి రంగాన్ని కాపాడడం కోసం సీపీఐ(ఎం) పనిచేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ప్రకాష్ నాయక్, వసంత్ నాయక్, బలరాం నాయక్, శంకర్, బి శంకర్ గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రెండోరోజు నిరసన

నవతెలంగాణ-రెంజల్



ఎస్సీ వర్గీకరణ పూర్తయినంత వరకు అన్ని రకాల ఉద్యోగ ఫలితాలను నిలిపివేయాలని కోరుతూ మండల పరిషత్ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరసన కార్యక్రమం రెండవ రోజుకు చేరుకుంది. ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షులు కిన్నెర మోహన్ అధ్యక్షతన ఈ నిరసన కార్యక్రమం చేపట్టినట్లు వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మిగారి భూమయ్య మాట్లాడుతూ.. మాదిగలకు తీవ్ర అన్యాయం జరిగేలా సీఎం రేవంత్‌రెడ్డి కుట్ర చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణ వచ్చేంతవరకు అన్ని రకాల ఉద్యోగాలు నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి బండారి పోశెట్టి, పి.సంజీవ్, దగ్గుల సాయిలు, రామన్న, వడ్డన్న, పిల్లల గంగాధర్, ఎర్రన్న, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్మికులపై వేధింపులు ఆపాలి

నవతెలంగాణ-వర్ని



గ్రామ పంచాయతీ కార్మికులపైన అధిక పనిభారం, వేతనాలలో కోతలు విధించటం, వారిని మానసికంగా వేధించటం వంటి దుర్మార్గపు చర్యలకు కొందరు అధికారులు వ్యవహరిస్తున్నారని, వెంటనే ఇటువంటి విధానాలు మానుకోకపోతే తగిన పోరాటాలు నిర్వహిస్తామని సీఐటీయూ మండలాధ్యక్షులు సాయిలు హెచ్చరించారు. వేసవి కాలం ఎండలు తీవ్రంగా ఉన్నందున కార్మికుల పనివేళలు మార్చాలని, పని ప్రదేశంలో మంచినీరు సౌకర్యం కల్పించాలని, పండుగలు, అత్యవసర సమయాలలో సెలవులివ్వాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఆరోగ్య భీమా సౌకర్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. మండల నాయకులు భూమయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు సాయి చరణ్, నాగయ్య, గంగారాం, వివిధ గ్రామాల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి కార్మిక సంఘం నాయకుల అరెస్ట్



కార్మిక సంఘం నాయకులను అరెస్టు చేసిన పోలీసులు

నవతెలంగాణ-బోధన్

బోధన్ నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ కార్మిక సంఘం నాయకులను సోమవారం అర్ధరాత్రి బోధన్ పట్టణ పోలీసులు అరెస్ట్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం నాయకులు ఉపేందర్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డిని, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబును కలవడానికి వెళ్తున్న క్రమంలో పోలీసులు అరెస్ట్ చేయడం అన్యాయమని అన్నారు. కార్మికులకు రావాల్సిన 10 సంవత్సరాల వేతన బకాయిలు ఇప్పించాలని, వేతనాలను సెటిల్మెంట్ చేయాలని వినతిపత్రం ఇవ్వడానికి వెళ్తున్న క్రమంలో అన్యాయంగా అరెస్టు చేయడం అన్యాయం, అక్రమమని అన్నారు. కార్మికులను ప్రభుత్వం ఇలాంటి ముందస్తు అరెస్టు చేయడం హేయమైన చర్య అని తెలిపారు. ఇప్పటికైనా ఫ్యాక్టరీలు లేఆఫ్ అయినప్పటి నుండి నేటి వరకు వేతనాలు ఇచ్చి న్యాయం చేయాలన్నారు. అరెస్టయిన వారిలో కార్మిక నాయకులు షుగర్ ఫ్యాక్టరీ మజ్దూర్ సభ యూనియన్ జనరల్ సెక్రెటరీ, సిఐటియు కుమారస్వామి, మల్లేశం, బాలకృష్ణ, శ్రీనివాస్, శ్రీధర్, బాలచందర్, రవిశంకర్‌గౌడ్ తదితరులున్నారు.

పార్లమెంట్ పరిధిలో రెండు నవోదయ పాఠశాలకు అనుమతి

- బీజేపీ మాజీ రూరల్ కోకన్వీనర్ హరీష్ గౌడ్

నవతెలంగాణ-ధర్పల్లి

నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు అరవింద్ కృషితో కేంద్ర ప్రభుత్వం నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో రెండు నవోదయ పాఠశాలల ఏర్పాటుకు అనుమతినిచ్చిందని బీజేపీ మాజీ రూరల్ కో -కన్వీనర్ బొల్లిపల్లి హరీష్‌గౌడ్ మంగళవారం తెలిపారు. నిజామాబాద్ జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు సమాన దూరంలో ఉన్న జక్రాన్‌పల్లి, కలిగోట్ గ్రామంలోని ప్రభుత్వ భూమిని స్థానిక ఎంపీ ప్రతిపాదించారని అన్నారు. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే భూపతిరెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమయస్ఫూర్తితో వివరించి ఏర్పాటుకు సహకరించాలని కోరారు. కాగా బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి నవోదయను బోధన్‌లో ఏర్పాటు చేయాలని ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తుందని అదే నిజమైతే దాన్ని అడ్డుకునే అవసరం ఎంతైనా ఉందని అన్నారు. రూరల్‌లో ఏర్పాటుకు అవసరమైతే పార్టీలకు అతీతంగా అందరూ గతంలో చేసిన ఉద్యమాల మాదిరిగా ఉద్యమం చేపట్టేందుకు సిద్ధంగా ఉండి సాధించుకునే అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు.

అంతర్జాతీయ వినియోగదారుల వారోత్సవాల పోస్టర్లు ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరించిన పలువురు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సెలక్షన్ గ్రేడ్ సెక్రెటరీ అధికారి ఎస్.అపర్ణ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వినియోగదారుల వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. అంతర్జాతీయ వినియోగదారుల హక్కుల వారోత్సవాలు 7 మార్చి నుంచి 15వ వరకు నిర్వహిస్తున్న క్రమంలో నిజామాబాద్‌లోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో వినియోగదారుల హక్కుల చైతన్య కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పెందుట అనిల్ కుమార్, సందు ప్రవీణ్ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ నిర్దేశించిన పోస్టర్ ఎనిమిది వినియోగదారుల హక్కులకు సంబంధించిన దానిని ఎస్.అపర్ణ వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సెలక్షన్ గ్రేడ్ కార్యదర్శి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కార్యదర్శి మహాదేవుని శ్రీనివాస్, ఆర్మూర్ డివిజన్ అధ్యక్షులు పొడపెల్లి అనిల్, రూరల్ డివిజన్ అధ్యక్షులు యాటకర్ల దేవేష్, గైని రత్నాకర్, వియస్ వర్మ, రాజుల రామనాథం, ప్రవళిక, గడప రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

'డీఈవో కండ్లు తెరిపించాలి'

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి కండ్లు తెరిపించాలని ఏఐఎస్ఎఫ్ నిజామాబాద్ జిల్లా నాయకులు అంబేద్కర్ విగ్రహనికి వినతిపత్రం అందజేశారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నగరంలోని (పులాంగ్ చౌరస్తాలో) డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఏఐఎస్ఎఫ్ నిజామాబాద్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అంజలి, రఘురాం మాట్లాడుతూ.. నిజామాబాద్ నగరంలోని ప్రెసిడెన్సీ ఇంటర్నేషనల్ (ఆరావళి క్యాంపస్) పేరుతో విద్యాశాఖ నుంచి ఎటువంటి పర్మిషన్ లేకుండా బిల్డింగ్ పూర్తి కాకముందే పెద్దపెద్ద హోర్డింగ్ (బ్యానర్)లతో తప్పుడు ప్రచారాలు చేస్తూ విద్యార్థుల దగ్గర నుంచి అడ్మిషన్ పేరుతో 50శాతం ఫీజు ముందే వసూలుచేస్తున్నారని అన్నారు. అయినా డీఈవో పట్టించుకోవడం లేదన్నారు. ప్రెసిడెన్సీ విద్యాసంస్థల మీద చర్యలు తీసుకోకపోతే మాత్రం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు రంజిత్, నవీన్, కృష్ణ, విట్టల్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణలక్ష్మి చెక్కులు అందజేత

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని జక్రాన్‌పల్లి, వివేక్‌నగర్ తండా, అర్గుల్, పలు గ్రామాల లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబాకర్ 50 చెక్కులను రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అందజేసినట్లు మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాట్పల్లి నర్సిరెడ్డి, నిజామాబాద్ రూరల్ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సొప్పరి వినోద్, మాజీ వైస్ ఎంపిపి జితేందర్ నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణకు దరఖాస్తుదారుల చొరవ

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు
- 25 శాతం రిబేటు సదుపాయాన్ని వినియోగించుకోవాలని హితవు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జిల్లాలో లేఔట్ క్రమబద్ధీకరణ పథకం (ఎల్.ఆర్.ఎస్) కోసం దరఖాస్తు చేసుకున్నవారు పూర్తిస్థాయి ఫీజు చెల్లించి ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకునేందుకు చొరవ చూపుతున్నారని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. ఈ నెల (మార్చి) 31 లోపు పూర్తి స్థాయి ఎల్.ఆర్.ఎస్ ఫీజుతో పాటు ప్రో-రాటా ఓపెన్ స్పేస్ చార్జీలను చెల్లించే వారికి ప్రభుత్వం 25 శాతం రిబేటు వర్తింపజేస్తోందని గుర్తుచేశారు. దీంతో దరఖాస్తుదారులు ఫీజు చెల్లించి ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు స్వతహాగా ముందుకు వస్తున్నారని అన్నారు. ఫీజు చెల్లించిన దరఖాస్తుదారులకు రిబేటును మినహాయిస్తూ, వెంటదివెంట ల్యాండ్ రెగ్యులరైజేషన్‌కు సంబంధించిన ప్రొసీడింగ్‌లు జారీచేయడం జరుగుతోందని కలెక్టర్ వివరించారు. ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలో 190 మంది ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించి తమ ప్లాట్లను క్రమబద్ధీకరించుకున్నారని తెలిపారు. ఇందులో రిబేట్ ప్రకటించిన తరువాత 65 మంది ఫీజు చెల్లించారని, మంగళవారం ఒక్క రోజే 15 మంది దరఖాస్తుదారులు తమ ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకున్నారని వివరించారు. అదేవిధంగా భీంగల్ మున్సిపాలిటీ పరిధిలో 26 మంది, బోధన్‌లో 104 మంది ఎల్.ఆర్.ఎస్ ఫీజు చెల్లించారని తెలిపారు. నిజామాబాద్ నగరపాలక సంస్థ పరిధిలో ఇప్పటివరకు 895 మంది ఫీజు చెల్లింపులు పూర్తిచేశారని, ఎల్.ఆర్.ఎస్ కింద రూ.12.45 కోట్ల రుసుము వసూలయ్యిందని కలెక్టర్ వివరించారు. మిగతా దరఖాస్తుదారులు కూడా నిర్ణీత గడువు లోపు ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించి తమ ప్లాట్ల క్రమబద్ధీకరణ చేసుకోవాలని, రిబేటు సదుపాయాన్ని సద్వినియోగం చేసుకుని లబ్ధిపొందాలని హితవు పలికారు. దరఖాస్తుదారుల సౌకర్యార్థం జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలలో సహాయక కేంద్రాలను ఏర్పాటు చేయించామని, దరఖాస్తుదారులు సంప్రదించవచ్చని సూచించారు. బఫర్, ఎఫ్.టి.ఎల్, చెరువులు, కుంటలు వంటి నిషేధిత జాబితాలోని ప్రాంతాలను మినహాయిస్తే, ఇతర ప్రాంతాలలోని ప్లాట్లకు ఆన్లైన్‌లో సులభంగా అనుమతి లభిస్తోందని అన్నారు. చెరువులు, నీటి వనరులకు సమీపంలో కనీసం 200 మీటర్ల దూరంలో ఉన్న స్థలాలకు రెవెన్యూ, నీటిపారుదల శాఖ అనుమతులు తప్పనిసరి అని కలెక్టర్ వెల్లడించారు. ఎల్ ఆర్ ఎస్ అర్హత లేని స్థలాలపై చెల్లించిన ఫీజులలో 90శాతం రిఫండ్ అవుతుందని, 10శాతం ప్రాసెసింగ్ చార్జెస్ కింద తీసుకుంటారని అన్నారు. స్థలాల క్రమబద్ధీకరణ పారదర్శకంగా చేపట్టేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని, ఎల్ఆర్ఎస్ ఫీజులు చెల్లించిన వారికి అర్హత ఉంటే స్థల క్రమబద్ధీకరణ చేసి సంబంధిత ప్రొసీడింగ్స్ జారీ చేస్తున్నామని పేర్కొన్నారు. ఎల్.ఆర్.ఎస్ అనుమతులు లేని భూములలో ఎటువంటి రిజిస్ట్రేషన్లకు, నిర్మాణాలకు అనుమతులు ఇవ్వబడవని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా క్రమబద్ధీకరణ చేసుకోవాలని, మార్చి 31వరకు ప్రభుత్వం కల్పించిన రిబేటు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని 25 శాతం రాయితీ పొందాలని కలెక్టర్ సూచించారు.

మహిళా సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట

- ఐకెపి ఎపిఎం కుంట గంగాధర్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



మాట్లాడుతున్న ఐకెపి ఎపిఎం కుంట గంగాధర్

మహిళా సంఘాల సభ్యుల సంక్షేమమే ధ్యేయంగా అన్ని పథకాల్లో రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఐకెపి ఎపిఎం కుంట గంగాధర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలను కోటీశ్వరులను చేయడంలో భాగంగా మహిళా సంఘాల ద్వారా యూనిఫామ్ తయారీ, వడ్డీ లేని రుణాల పరిమితి పెంచడం, సమాఖ్యలకు ఆర్టీసీ బస్సులు కేటాయించడం, సోలార్ యూనిట్ల ఏర్పాటు, సూక్ష్మతరహా ఆహార శుద్ధి పరిశ్రమ, చిరు వ్యాపారాలకు రుణాలు ఇవ్వడం వంటి వినూత్న కార్యక్రమాలను చేపడుతోందని వివరించారు. ప్రతి మహిళా సంఘం సభ్యురాలికి రూ.2లక్షల వరకు రుణబీమా సదుపాయం కూడా కల్పించిందన్నారు. ఇందులో భాగంగా మండలంలో 8 మంది సభ్యులు అకాల మరణం చెందగా వారికి సంబంధించిన క్లైమ్‌లు ప్రభుత్వానికి ప్రతిపాదించడం జరిగిందని తొందరలోనే వారి కుటుంబానికి లబ్ధి చేకూరబోతోందని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వడ్డీ లేని రుణాలతో పాటు అన్ని రకాల పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం మహిళలకు పలు క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించారు. అనంతరం బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు రోజా రాణి, సీసీలు వర్గం శ్రీనివాస్, నవీన్‌కుమార్, భాగ్యలక్ష్మి, పీరియ, అలేఖ్య, సిబ్బంది ధనలక్ష్మి, అనసూయ, సత్తెమ్మ, అన్ని గ్రామాల మహిళా సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళను గౌరవిస్తేనే మానవ మనుగడ

- ఎంఈవో గేమ్‌సింగ్

నవతెలంగాణ-మోపాల్



మహిళలను సన్మానించిన పలువురు

సమాజంలో మహిళ మూర్తులను గౌరవించినప్పుడే మానవ మనుగడ సాధ్యమవుతుందని, మహిళా చైతన్యం ప్రపంచాన్ని ప్రగతి పథంలో నడిపిస్తుందని మన మధ్య ఉన్న మహిళలను సగౌరవంగా చూడడం, సత్కరించుకోవడం చాలా మంచి సంప్రదాయమని మోపాల్ మండల విద్యాధికారి గేమ్ సింగ్ అన్నారు. మంగళవారం మండలంలోని సిర్పూర్ ఉన్నత పాఠశాలలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళా ఉపాధ్యాయులకు సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థినులందరికీ కూడా చక్కగా చదువుకొని అన్ని అవకాశాలను వినియోగించుకొని జీవితంలో రాణించాలని సూచించారు. చదువు ద్వారా ఉద్యోగాలు సాధించాలని ఆర్థిక స్వేచ్ఛ అన్నింటికంటే గొప్ప ఆత్మ గౌరవాన్ని కలిగిస్తుందని తెలిపారు. అందుకని ఆడపిల్లలు అందరూ శ్రద్ధగా చదువుకోవాలని కోరారు. ఈ సందర్భంగా సభకు అధ్యక్షత వహించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.సత్యనారాయణ మాట్లాడుతూ.. మహిళా శక్తి అత్యున్నతమైందని ఇంటి నుంచి మింటిదాకా ఎగిసిన చైతన్యం స్త్రీలదని, మనతోపాటు సమాజ అభివృద్ధిలో సగభాగంగా నిలిచిన స్త్రీలు భవిష్యత్తులో సంపూర్ణంగా అన్ని అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా తమతో కలిసి సేవలందిస్తున్న ఉపాధ్యాయినీలకు సత్కారం అందించడం ఆనందదాయకమన్నారు. అలాగే టిటియు జిల్లా అధ్యక్షులు లాటికర్ రాము పాల్గొని ప్రసంగించారు. ఈ సభలో ప్రాథమిక పాఠశాల సిర్పూర్ ప్రధానోపాధ్యాయిని నాగమణి, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు లలిత, శ్యామల, వందన, గాయత్రి, నీలేశ్‌ను ఉపాధ్యాయ బృందం ఘనంగా సత్కరించింది. ఈ సభలో ఉపాధ్యాయులు టి.మోహన్, డి.అక్బర్‌బాషా, డాక్టర్ హజారే శ్రీనివాస్, డాక్టర్ కాసర్ల నరేష్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో ప్లానిటేరియం షో

నవతెలంగాణ-ఆర్మూర్



ప్లానిటేరియం షోలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

పట్టణ శివారులో గల గాంధీనగర్‌లోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో రోబో చాంప్ సంస్థ ఆధ్వర్యంలో 3వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఉన్న విద్యార్థులకు ఆసక్తికరమైన ప్లానిటేరియం షోను మంగళవారం నిర్వహించారు. ఈ ప్రదర్శన విద్యార్థులను ఉల్లాసంగా, ప్రతిభావంతులుగా మార్చే ఒక మహద్భుతమైన అనుభవాన్ని అందించింది. విద్యార్థుల కోసం, సౌర వ్యవస్థపై గ్రహాలు, నక్షత్రాలు, అంతరిక్షపు రహస్యాలకు చంద్రుడు, పగలు, రాత్రి గురించి ఒక ఆకర్షణీయమైన సెషన్‌ను అందజేశారు. ఇందులో చంద్రుని దశలు, పగలు రాత్రి చక్రాలపై శాస్త్రజ్ఞానాన్ని నేర్పించారు. మన గెలాక్సీ, అంతరిక్ష అన్వేషణపై మరింత క్లిష్టమైన, ఆసక్తి కరమైన అంశాలను పరిచయం చేశారు. విద్యార్థులు అంతరిక్ష మిషన్లు, పర్యటనలు, అంతరిక్ష అన్వేషణకు ఉపయోగించే ఆధునిక సాంకేతికత గురించి అవగాహన పెంచుకోగలిగారు. ఈ షోలో ఆధునిక ప్లానెటేరియం పరికరాలు ఉపయోగించి, అద్భుతమైన దృశ్యాలు, ఇంటరాక్టివ్ అంశాలు, నిపుణుల వివరణలు అందించారు. ఇవి విద్యార్థుల మనస్సులను ఆకట్టుకుంటూ, వారి ఊహాశక్తిని ఉత్తేజపరిచాయి. ఇలాంటి ఈవెంట్లు వారి అకాడమిక్ అభ్యాసాన్ని పెంచడమే కాకుండా శాస్త్రీయ అన్వేషణలో ఆసక్తిని, కొత్త ఆవిష్కరణలను ప్రేరేపిస్తాయని పాఠశాల కరస్పాండెంట్ మానస గణేష్ అన్నారు. పాఠశాల పాలనాధికారిణి పద్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగాలి

- పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు మోహన్ రెడ్డి

నవతెలంగాణ-నవీపేట్



మహిళలను సన్మానించిన పలువురు

మహిళలు అన్ని రంగాల్లో ప్రాతినిధ్యం మరింత పెంచుకోవాలని పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు మోహన్ రెడ్డి అన్నారు. పిఆర్‌టియు ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం సందర్భంగా రైతు వేదికలో మహిళా ఉపాధ్యాయులకు మంగళవారం సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కిషన్ మాట్లాడుతూ.. కుటుంబంలో మహిళ పాత్ర కీలకమైందని అన్నారు. మహిళా ఆదిపత్యం ఉన్న కుటుంబాలు అభివృద్ధి చెందడమే నిదర్శనమని అన్నారు. అందుకే మహిళలు మొహమాట పడకుండా అన్ని రంగాలలో ప్రాతినిధ్యం వహించాలని అన్నారు. మహిళా ఉపాధ్యాయుల కోసం పిఆర్‌టియు ఎంతో కృషి చేసిందని కానీ సంఘాన్ని కాదని పార్టీల వైపు మొగ్గు చూపడం ఆశ్చర్యం కలిగించిందని అన్నారు. సమాజంలో స్త్రీ, పురుషుల తేడా లేకుండా సమానత్వం రావాలని అందుకు మహిళ ఉపాధ్యాయులు పాఠశాల స్థాయిలోనే కృషి చేయాలని ఎంఈఓ అశోక్ అన్నారు. పిఆర్‌టియు మండల అధ్యక్షులు భూమయ్య, ప్రధాన కార్యదర్శి శివకుమార్, ఉపాధ్యాయులు రాధ, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుడిపై ఎలుగుబంటి దాడి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

గీత కార్మికుడిపై ఎలుగుబంటి దాడి చేసిన ఘటన మండలంలోని కలిగోట్‌లో జరిగింది. కలిగోట్ కోరట్‌పల్లి సరిహద్దుల్లో గల వాగులో రాములు అనే గీతా కార్మికుడు ఈత చెట్ల వద్దు కల్లు తేవడానికి వెళ్లగా ఒక్కసారిగా ఎలుగుబంటి దాడి చేసింది. అతని చేతికి స్వల్ప గాయాలవడంతో అతడిని ఆసుపత్రికి తరలించారు. ఎలుగుబంటి సంచారంపై ఇందల్వాయి ఎఫ్ఆర్ఓను వివరణ కోరగా అతని చేతి వేలికి స్వల్ప గాయమైనది వాస్తవమేనని.. ఎలుగుబంటి సంచరించిన స్థలాన్ని పరిశీలిస్తామని తెలిపారు.

ఇంటి పన్నుల వసూళ్లను పరిశీలించిన డీఎల్పీఓ



ఇంటి పన్ను వసూలు చేస్తున్న అధికారులు

నవతెలంగాణ-ఏర్గట్ల

ఏర్గట్ల గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఇంటి పన్నుల వసూళ్ళను మంగళవారం ఆర్మూర్ డీఎల్పీఓ శివకృష్ణ పరిశీలించారు. ప్రజలు ఇంటి పన్నులను సకాలంలో చెల్లించాలని, దుకాణాల యజమానులు వృత్తిపరమైన లైసెన్స్‌లను ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా రెన్యువల్ చేయించుకోవాలని అన్నారు. ఈ నెల 25వ తేదీ నాటికి 100 శాతం పన్నులను వసూలు చేయించాలని గ్రామపంచాయతీ అధికారికి సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని ఎస్సి హాస్టల్‌ను సందర్శించి, స్టోర్ రూమ్, వంట గది, స్నానాల గదులను పరిశీలించి, విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఇందులో భాగంగా ఎంపీఓ శివచరణ్, పంచాయతీ కార్యదర్శి జాకీర్ హుస్సేన్, కారోబార్లు సాయన్న, రఫీక్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 852మంది విద్యార్థులు గైర్హాజరు

- ఓ విద్యార్థిపై మాల్ ప్రాక్టీస్ కేసు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఇంటర్మీడియట్ పరీక్షలు మంగళవారం మొదటి సంవత్సరం బొటనీ, పొలిటికల్ సైన్స్, మ్యాథ్స్-1ఏ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని జిల్లా ఇంటర్ విద్య అధికారి తిరుమలపుడి రవికుమార్ తెలియజేశారు. మొత్తం 852 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 21,218 మంది విద్యార్థులకు గాను 20,366 విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని తెలియజేశారు. మొత్తం 96 శాతం మంది విద్యార్థులు పరీక్షలు రాయగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలు నిర్వహించామని తెలియజేశారు. డిచ్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒక విద్యార్థి చీటీలు రాస్తుండగా పట్టుకుని మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు చేశామని జిల్లా ఇంటర్ విద్య అధికారి తెలిపారు. జిల్లాలో మొత్తం 57 పరీక్ష కేంద్రాలకు గాను 54 పరీక్ష కేంద్రాలను తనిఖీలు చేశారు. జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులతో పాటు తాను ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్‌లు, హైపవర్ కమిటీ, బల్క్ అధికారి, కస్టోడియన్లు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసి పర్యవేక్షణ చేశారని జిల్లా ఇంటర్ విద్యా అధికారి తెలియజేశారు. జిల్లా ఇంటర్ విద్యా అధికారి తిరుమలపూడి రవికుమార్ బోధన్ పట్టణంలోని మధుమలాంచ జూనియర్ కళాశాల, విద్యవికాస్ జూనియర్ కళాశాల రెండు కేంద్రాలు, బోధన్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, విజేత జూనియర్ కళాశాల, ఉషోదయ జూనియర్ కళాశాల రెండు కేంద్రాలు, విజయసాయి, షిరిడీసాయి జూనియర్ కళాశాలలను తనిఖీ చేసి సమీక్షించారు. హైపవర్ కమిటీ శ్రీనాథ్ ఆధ్వర్యంలో 7 జూనియర్ కళాశాలలు, పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు చిన్నయ్య, రజీయుదిన్ అస్లాం, కనకమహాలక్ష్మి 16 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు నర్సయ్య, బాలాజీ, యమున బృందం 16 పరీక్ష కేంద్రాలను, సిటింగ్ స్క్వాడ్ బృందాలు ఆరు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. బల్క్ అధికారి బుద్ధిరాజ్ మూడు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసి సమీక్షించారు.

విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు, అవగాహన

నవతెలంగాణ-భీంగల్ రూరల్

కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల విద్యార్థులకు డాక్టర్ ఈ.శీనునాయక్ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అలాగే దంత సంరక్షణపై అవగాహనా సదస్సును నిర్వహించారు. అలాగే పదవ తరగతి పరీక్ష రాసే విద్యార్థులకు పరీక్ష కేంద్రానికి అవసరమైన వస్తువులను, పరీక్ష అట్ట, మూడు పెన్నులు, పెన్సిల్, స్కేల్‌ను అందించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు డాక్టర్ శీను నాయక్‌కు ధన్యవాదాలు తెలియజేశారు.

ఇంటి పన్నుల వసూళ్ల కోసం ప్రత్యేక బృందం

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రమైన రెంజల్ గ్రామంలో మంగళవారం ఇంటి పన్నులను వసూలు చేయడానికి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు గ్రామ కార్యదర్శి రాజేందర్‌రావు పేర్కొన్నారు. మార్చి నెల చివరిలోపు 100శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని పై అధికారులు ఆదేశాలు రావడంతో వివిధ గ్రామాలలోని గ్రామ కార్యదర్శుల సహకారంతో ప్రత్యేక బృందంగా ఏర్పడి వసూళ్లను చేపట్టినట్లు ఆయన తెలిపారు. మంగళవారం సుమారు రూ.15 వేలు ఇంటి పన్నులు వసూలు చేసినట్లు ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు జాజూ శ్రీకాంత్, రాజు, సునీల్ యాదవ్, బిల్ కలెక్టర్ భాస్కర్, కంప్యూటర్ ఆపరేటర్ కమల ప్రవీణ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ రుసుము 25శాతం తగ్గింపు

- ఫ్లెక్సీలతో ప్రచారం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఎల్ఆర్ఎస్ రుసుము 25శాతం తగ్గింపుపై నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. 2025 మార్చి 31లోగా పూర్తి ఫీజు చెల్లించి 25శాతం రాయితీ పొందాలని.. అలాగే మరికొన్ని వివరాలతో కూడిన ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. అంతేకాకుండా వివరాలకు lrs.telangana.gov.inq సందర్శించాలని, మిగతా వివరాలకు టోల్ ఫ్రీ నెంబర్ 9700918886కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో ఉంది.


మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేయించిన ఫ్లెక్సీ

మాక్లూర్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షులుగా ఎం.మహేందర్

నవతెలంగాణ-మాక్లూర్

ప్రెస్‌క్లబ్ మండలాధ్యక్షులుగా నవతెలంగాణ మండల రిపోర్టర్ ఎం.మహేందర్‌ను మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇందుకు గానూ మండల పాత్రికేయులందరూ ఆయనను బలపరిచారు. ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా డి.రమేష్, ప్రధాన కార్యదర్శిగా ఎం.నవీన్, కార్యదర్శిగా పోతన్న, క్యాషియర్‌గా శంకర్‌ను ఎన్నుకున్నారు. మిగతా సభ్యులను కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.


ఎన్నికైన నూతన ప్రెస్‌క్లబ్ సభ్యులు

లిఫ్ట్ ప్రమాదంలో కమాండెంట్ మృతి

నవతెలంగాణ-పోతంగల్ (కోటగిరి)

కోటగిరి మండలంలోని సుద్దులం నివాసి గంగారాం 17వ బెటాలియన్ టీజీ కమాండెంట్ మంగళవారం తన స్నేహితుడు డిఎస్పి చంద్రశేఖర్‌రావును కలిసేందుకు వెళ్లి.. తిరిగి వస్తుండగా లిఫ్ట్‌లో ప్రమాదం చోటుచేసుకుని మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. లిఫ్టుపైకి రాకముందే డోర్ తెరుచుకోవడంతో లిఫ్ట్ వచ్చిందనుకొని లోపల అడుగు వేసిన కమాండెంట్ గంగారం, మూడో అంతస్తుపై నుంచి గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న లిఫ్ట్‌పై పడి మృతిచెందాడు.

పెండ్లి కానుక.. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్

- ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-వర్ని

ప్రభుత్వం పేదింటి ఆడ బిడ్డల పెళ్ళికి కానుకగా కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం ఎంతో ఆసరాగా ఉందని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం బాన్సువాడ పట్టణంలోని తన నివాసంలో వర్ని, చందూర్, మండలాల లబ్దిదారులకు కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలు మండల ప్రజా ప్రతినిధులు, లబ్దిదారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్‌లు పంపిణీ

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని బోర్గాం(కె) గ్రామం నిజామాబాద్‌లోని 2వ డివిజన్‌కు చెందిన డాక్టర్ మట్ట చరణ్ సహకారంతో మాణిక్‌బండార్‌లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్పోర్ట్స్ దుస్తులను మంగళవారం ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నగరంలోని సుభాష్‌నగర్‌లో గల అర్బన్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆర్‌అండ్‌బీ అధికారులతో అర్బన్ శాసనసభ్యులు ధన్‌పాల్ సూర్యనారాయణ మంగళవారం సమీక్షా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌బి ఈఈ శ్రీమాన్ నారాయణ, డిఈ ప్రవీణ్, మున్సిపల్ డిఈ రషీద్, కాంట్రాక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

మాదిగలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి

నవతెలంగాణ-కంఠేశ్వర్

సీఎం రేవంత్‌రెడ్డి నిండు అసెంబ్లీలో మాదిగలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ఫలితాల విడుదలను విరమించుకోవాలని, ఎస్సీ వర్గీకరణ ప్రకారమే ఉద్యోగాల భర్తీ ప్రక్రియ చేపట్టాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు కనక ప్రమోద్ మాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ ధర్నాచౌక్ ఎదుట నిరసన దీక్షలు చేపట్టారు. ఈ నిరసన దీక్షలను ఎంఈఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు తెడ్డు గంగారాం మాదిగ ప్రారంభించారు. ఈ దీక్షలో మిత అయ్యాల్వార్ సంక్షేమ సంఘం టౌన్ అధ్యక్షులు సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని ముదక్‌పల్లి గ్రామంలోని పలువురు లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులను మంగళవారం పంపిణీ చేశారు. రూరల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి చెక్కులను అందజేశారు.

మహిళా ఉపాధ్యాయులకు సన్మానం

నవతెలంగాణ-(వేల్పూర్) ఆర్మూర్

మండలంలోని అంక్సాపూర్ జడ్‌పిహెచ్‌ఎస్ పాఠశాలలో మాదిరి అన్నపూర్ణ స్మారక ట్రస్టు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు ఆర్.మల్లీశ్వరి అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు నిర్వహించారు.

విద్యార్థులకు కండ్ల అద్దాలు పంపిణీ

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని జంబి హనుమాన్ ఆలయ ప్రాంగణంలో గల ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం అందజేస్తున్న కండ్ల అద్దాలను మంగళవారం విద్యార్థినులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ రమేష్, డిఈఓ అశోక్, ఆర్‌బిఎస్‌కె వైద్యులు సంతోష్, మమత కంటి వైద్య నిపుణులు డాక్టర్ భుజంగారెడ్డి, ప్రాధానోపాద్యాయురాలు వనజ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రం

నవతెలంగాణ-డిచ్‌పల్లి


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ప్రత్యేక అధికారి యోహాన్, ఎంపిడిఓ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని నడ్పల్లి మేజర్ గ్రామ పంచాయితీ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని మండల ప్రత్యేక అధికారి యోహాన్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ గౌడ్, గ్రేడ్‌వన్ కార్యదర్శి నిట్టు కిషన్ రావు తదితరులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ రజత్ కుమార్, బిల్ కలెక్టర్లు సంతోష్, రాము, కంప్యూటర్ ఆపరేటర్ శ్యాంసన్, అటెండర్స్ బాబా, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ అరవింద్‌వి పొగరు మాటలు

- దీనిని తీవ్రంగా ఖండిస్తున్నాం
- జిల్లాకు ఆయన చేసిందేమీ లేదు
- నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

ఎంపీ అరవింద్ పొగరు మాటలు మాట్లా డుతున్నాడని.. దీనిని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండి స్తుందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని రూరల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'జాతీయ విద్యా విధానంలో భాగంగా ప్రతి జిల్లాకు ఒక నవోదయ పాఠశాల రావాలి. నవోదయ పాఠశాల ఇచ్చేది ఇవ్వకపోయేది దానికో కమిటీ ఉంటుంది. తాము జక్రాన్‌పల్లి, దుబ్బాకలో 30 ఎకరాల ఒక మంచి ల్యాండ్ చూయించాం. బోధన్‌లో ఒక ల్యాండ్ చూపెట్టాం. ఇది కాకుండా ఎంపీ కలిగోట్‌లో స్థలాన్ని ఎందుకు చూయించారని ప్రశ్నించారు. 2020లో రావాల్సింది.. 2025 వరకు రాలేదు. అందుకు ఎంపీ నిర్లక్ష్యమే కారణమన్నారు. అలాగే బీసీలకు 42శాతం రిజర్వేషన్లు, విద్యా విధానంలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అసెంబ్లీలో చట్టం తీసుకురాబోతున్నాం. అలాగే బీసీల కులగణన కూడా చేశాం. ఏ పార్టీకైనా ఈ విధంగా చేసే దమ్ముందా?. బీఆర్ఎస్, బీజేపీ పాలనలో చేసిందేమీ లేదు. కానీ అనవసరంగా కాంగ్రెస్‌పై మాట్లా డుతున్నారు. తెలంగాణ ఎంపీలు గుజరాత్ నాయకుల చెప్పులు మోస్తున్నారని విమర్శించారు. బీజేపీ ఎంపీలు తెలంగాణ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సూచిం చారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గంగారెడ్డి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ సాయిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కార్పొరేట్లకు గులాంగిరి చేస్తున్న మోడీ

- రైతు వ్యతిరేక చట్టాలను పాతరేద్దాం
- ఎంఎస్‌పి చట్టాన్ని కేంద్రం వెంటనే అమలు చేయాలి
- ఎస్.కె.ఎం ఆధ్వర్యంలో ధర్నాచౌక్ వద్ద ధర్నా

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రధానిమోడీ కార్పొరేట్ శక్తులకు సలాం కొట్టి గులాంగిరి చేస్తున్నారని ఎస్.కె.ఎం రాష్ట్ర నాయ కులు, ఎ.ఐ.యూ.కె.ఎస్ కేంద్ర నాయకులు వి.ప్రభా కర్, ఎ.ఐ.కె.ఎం.ఎస్ రాష్ట్ర నాయకులు ఎ.పాపయ్య విమర్శించారు. సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్.కె.ఎం.) ఆధ్వర్యంలో మంగళవారం ధర్నాచౌక్ వద్ద "రైతులధర్నా" . నిర్వహించారు. ఈ సంద ర్భంగా ధర్నాను ఉద్దేశించి ఎస్.కె.ఎం రాష్ట్ర నాయ కులు, ఏ.ఐ.యూ.కె.ఎస్ కేంద్ర నాయకులు వి.ప్రభాకర్, ఎ.ఐ.కె.ఎం.ఎస్ రాష్ట్ర నాయకులు ఏ పాపయ్య మాట్లాడుతూ.. రైతు వ్యతిరేక చట్టాలను బలమైన రైతాంగ పోరాటాలతో పాతరేద్దామని తెలిపారు. రైతాంగం పెద్దఎత్తున ఆందోళనల్లో పాలు పంచుకోవాలని వివరించారు. కేంద్రం రైతాంగం పట్ల సవతి తల్లి ప్రేమను కురిపిస్తుందని అన్నారు. ప్రధాని మోడీ రైతాంగానికి, వారి ఆందోళనలకు భయపడి రాతపూ ర్వకంగా హామీనిచ్చి అమలు చేయ డం లేదన్నారు. రైతుల పట్ల కపట ప్రేమను కురిపిస్తూ మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. ఇచ్చిన మాట ప్రకారంగా ఎం.ఎస్.పి. చట్టాన్ని కేంద్రం వెంటనే చేసి అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్పొరేట్ శక్తులకు కీలుబొమ్మగా మారిన ప్రధాని మోడీ వ్యవసాయ రంగాన్ని మొత్తం అప్పగించే కుట్రలకు పూనుకుంటున్నాడన్నారు. రైతాంగాన్ని విస్మరిస్తే మోడీ మెడలు వంచి బుద్ధి చెప్తామన్నారు. ఇప్పటికైనా రైతాంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. కంజర భూమయ్య, బి.దేవా రం, పి.రామకృష్ణ, ఎస్.సురేష్, వెంకటేష్, సాయిరెడ్డి, బొంబాయి గంగారం. కే.గంగాధర్, బి.గంగారెడ్డి, జి.కిషన్, బి.కిషన్, టి.కృష్ణగౌడ్, ఎం.నాగేష్, ఆర్.దామోదర్, బి.బాబన్న, ఎం.నరేందర్, యు.రాజన్న, బి.కిశోర్, అనీస్, అశోక్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వి.ప్రభాకర్

వెల్‌నెస్ సెంటర్‌లో సేవలకు ఆటంకాలు

- కలెక్టర్ జోక్యం చేసుకోవాలి
- తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కే రామ్మోహన్‌రావు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఉద్యోగ, పెన్షనర్ల, జర్నలిస్టుల అవుట్ పేషంట్ (ఓపి) సేవల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన వెల్‌నెస్ సెంటర్‌లో గత వారం రోజులుగా మందులు ఇచ్చేందుకు సరైన సిబ్బంది లేక అనేక ఇబ్బం దులు గురవుతున్నామని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కే రామ్మోహన్‌రావు అన్నారు. మంగళ వారం ఓపి సేవలు పూర్తిగా నిలిచి పోయిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఫార్మసిస్టులు లేక మందులు ఇవ్వలేదని, ఇంటర్నెట్ సేవలు లేవని, పవర్ లేదని, సరిపడా ఫార్మసిస్టులు అందుబాటులో లేరని తదితర కారణాలతో పెన్షనర్లకు మందులు ఇచ్చేందుకు గత వారం రోజులుగా లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. దాదాపు 25 మంది సిబ్బంది ఈ వెల్‌నెస్ సెంటర్లో ఉన్న కూడా ఈ పరిస్థితి ఉండటం దారుణమని ఆయన అన్నారు. కామారెడ్డి తదితర సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన సీనియర్ సిటిజన్లు గత వారం రోజులుగా అనేక ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే ఫార్మసీ సిబ్బందిని అందుబాటులోకి తీసుకొచ్చి వెల్‌నెస్ సెంటర్ పనితీరును మెరుగుపరచాలని ఆయన జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. మంగళవారం 200 మందికిపైగా సీనియర్ సిటిజన్లు గంటల తరబడి వెల్‌నెస్ సెంటర్ నందు పడిగాపులు కాసి వెనుదిరిగి పోయారని ఆయన అన్నారు.


వెల్‌నెస్ సెంటర్ వద్ద మాట్లాడుతున్న రామ్మోహన్‌రావు

రైతులు ఆందోళన చెందొద్దు

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి

నవతెలంగాణ-కంఠేశ్వర్

రైతులు ఆందోళన పడాల్సిన అవసరం లేదని, సమస్యను ప్రభుత్వం గుర్తించి సానుకూలంగా స్పందిస్తుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, నగర అధ్యక్షులు కేశవవేణు ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన ఎంఎల్సి ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తీవ్రంగా శ్రమించిన ఒడిపోవడం నిరాశ పరిచిందన్నారు. ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగులకు, ఉపాధ్యాయులకు సిఎం అన్ని విధాలుగా అభివృద్ధి చేసినా.. ఈ ఎన్నికల్లో ఓడిపోవడం నిరాశకు గురి చేసిందని తెలిపారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత 56 వేల ఉద్యోగాలు ఇచ్చినా.. పట్టభద్రులు ఎందుకు ఓటు వేయలేదో అనేది అర్థం కావడంలేదని పేర్కొన్నారు. ఎంఎల్సి ఎన్నికల్లో ఓటమిపై జిల్లా కాంగ్రెస్ నాయకులందరూ కలిసి సమీక్ష నిర్వహిస్తామని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కచ్చితంగా కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని, ఇంకా ఎక్కువగా కష్టపడి స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు వైపు ముందడుగు వేస్తామన్నారు. గత మూడు నాలుగు రోజులుగా జిల్లాలో పసుపు ధర గురించి రైతులు ఆందోళన చెందుతున్నారని, పసుపు రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పసుపు కొనుగోళ్లకు ప్రత్యేక అధికారిని నియమించాలని కలెక్టర్‌కు తెలిపినట్టు చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు రత్నాకర్, జిల్లా ఓబీసీ అధ్యక్షులు నరేందర్ గౌడ్, సేవాదళ్ అధ్యక్షులు సంతోష్, మాజీ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గోపి, రాష్ట్ర ఎన్ఎస్‌యుఐ ప్రధాన కార్యదర్శి వేణురాజ్, బింగి శుభం, సాయికిరణ్, కౌశిక్, తదితరులు పాల్గొన్నారు.

ఎడ్యుకేషనల్ టూర్‌లో గిరిరాజ్ కళాశాల విద్యార్థులు



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల నిజామాబాద్ బయోటెక్నాలజీ, మైక్రోబయాలజీ, బయోకెమిస్ట్రీ విభాగాలకు చెందిన విద్యార్థులు ఎడ్యుకేషనల్ టూర్‌లో భాగంగా ప్రభుత్వ మెడికల్ కళాశాల నిజామాబాద్‌ను సందర్శించారు. మెడికల్ కళాశాలలో గల డయాగ్నోస్టిక్ ల్యాబ్, వైరాలజీ సెంటర్, బాక్టీరియాలజి, పాథలాజీ, మైకాలజి ల్యాబ్ లలో వివిధ వ్యాధి నిర్ధారణ పద్ధతులను, ఎలిసా, ఆర్టి పిసిఆర్, మైక్రో బయాలజి కల్చర్ చేయు విధానాలను కళాశాల మైక్రోబయాలజీ విభాగాధిపతి డా.రమ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ప్రసాద్, సాయిపునీత్‌లు విద్యార్థులకు చూపించారు. ఈ కార్యక్రమంలో గిరిరాజ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రామ్మోహన్‌రెడ్డి, మైక్రోబయాలజి విభాగాధిపతి డాక్టర్ పి.ముత్తన్న, బయోకెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్.చంద్రశేఖర్, బయోటెక్నాలజీ విభాగాధిపతి టి.నరేష్ కుమార్, అధ్యాపకులు టి. భార్గవి పాల్గొన్నారు.

రైతుల గోసపై కలెక్టర్ స్పందించినా.. ఎమ్మెల్యే పట్టించుకోవట్లే : బీజేపీ

నవతెలంగాణ-ధర్పల్లి

రైతులు పండిస్తున్న పంటలు ఎండిపోయి కన్నీరు కారుస్తుంటే కనీసం ఎమ్మెల్యే కన్నెత్తి చూడకపోవడం బాధాకరమని బీజేపీ పార్టీ మండల అధ్యక్షుడు జిర్ర మహిపాల్ విమర్శించారు. రైతులు వేసిన పంటలు ఎండిపోయి ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా స్పందించిన తమ పార్టీ జిల్లా అధ్యక్షుడు స్పందించి రూరల్‌లోని రైతుల గాధ స్వయంగా పరిశీలించి చలించిపోయారని, రైతుల బాధలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా.. మంగళవారం కలెక్టర్ వచ్చి క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. అయినా ఇప్పటి వరకు రైతు సోదరుల ఓట్లతో గెలిచిన ఎమ్మెల్యే స్పందించకపోవడం దురదృష్టకరమని అన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే స్పందించి రైతులకు కావాల్సిన 2, 3 తడుల నీటిని ట్యాంకర్ల ద్వారా నీటిని అందించి వారి పంటలకు కాపాడే చర్యలు తీసుకోవాలని అయన డిమాండ్ చేశారు.

విద్యార్థుల ప్రతిభోత్సవం

నవతెలంగాణ-బోధన్

సాలూర మండలంలోని ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు ప్రతిభోత్స ప్రజ్ఞోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. సాలూర మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ప్రాథమిక విద్యార్థులకు చదవడం, రంగులు వేయడం, కథలు చెప్పటం, గణితంలో అరిత్మెటిక్ స్కిల్స్, స్పూన్ మార్బుల్ రేస్ వంటి పోటీలు నిర్వహించారు. గెలిచిన విద్యార్థులకు ఎంఈఓ రాజీమంజూష బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం కబ్జాపై అసత్య ఆరోపణలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

బోర్గం (పి) ప్రాంతంలో గల ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేశారంటూ కొందరు అసత్య ప్రచారం చేస్తున్నారని బోర్గం ప్రాంతానికి చెందిన సందగిరి భూమారెడ్డి, రతన్‌రావు, రాజశేఖర్‌రెడ్డి వెల్లడించారు. తమ పూర్వీకుల స్థలాన్ని కబ్జా చేశారంటూ కొందరు వ్యక్తులు తమపై దుష్ప్రచారం చేస్తున్నారని వారు ఆరోపించారు. నిజామాబాద్ జిల్లా కేంద్రానికి సమీప దూరంలో గల బోర్గం(పి) ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు పక్కనే గల 586/3 సర్వే నంబర్‌లోని 1.21 గుంటల భూమి తమ పూర్వీకులకు సంబంధించిందని, దీనిపై సర్వ హక్కులు తమకే ఉన్నాయని వారు స్పష్టం చేశారు. దీనిని గతంలోనే సబ్ డివిజన్‌గా మార్చి తమ పేరిట రిజిస్ట్రేషన్ కూడా చేసుకున్నట్టు తెలిపారు.

ఎస్సీల వర్గీకరణ తర్వాతనే ఉద్యోగ నియామకాలు చేపట్టాలి

నవతెలంగాణ-ఆర్మూర్

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎస్సీల వర్గీకరణకు చట్టబద్ధత తరువాతనే ఉద్యోగ నియామకాలను చేపట్టాలని తహసిల్దార్ కార్యాలయం ముందు 2వ రోజు రిలే దీక్ష మంగళవారం కొనసాగింది. ఈ దీక్ష కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మాజీ జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్చార్జి మైలారం బాలు మాట్లాడుతూ.. నిండు అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి మాదిగలకు ఇచ్చిన హామీని మరచి గ్రూప్ 1 ఫలితాలను విడుదల చేయడం మాదిగలను మోసచేయడమేనని మండిపడ్డారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు మైలారం రాము, మండల ప్రధాన కార్యదర్శి నుతూపల్లి సంతోష్, కోశాధికారి మంగలరం రవి, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

టీయూ పేరు మార్చొద్దు

- పిడిఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

నిజామాబాద్ జిల్లాలోని తెలంగాణ యూనివర్సిటీ పేరును మార్చాలనే ఆలోచనను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహ రించుకోవాలని డిమాండ్ చేస్తూ పిడిఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం యూని వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.యాదగిరికి వినతిపత్రాన్ని అందజేశారు.

పెరిగిన కరువుభత్యం అమలు చేయాలి

టియుసిఐ రాష్ట్ర అధ్యక్షులు వనమాల కృష్ణ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

బీడీ కార్మికులకు పెరిగిన కరువు భత్యం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ (టియుసిఐ అనుబంధం) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో బీడీ యాజమాన్యాల సంఘం అధ్యక్ష, కార్యదర్శులను కలిసి నోటీసు ఇచ్చి, యూనియన్ కార్యాలయం శ్రామిక భవన్, కోటగల్లిలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వనమాల కృష్ణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఏడు లక్షల మంది బీడీ కార్మికులకు ఏప్రిల్ 1వ తేదీ నుండి పెరిగిన కరువు భత్యం వెంటనే అమలు చేయాలని బీడీ పరిశ్రమల యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. వీడీఏ కరువు భత్యం 104 పాయింట్లు పెరిగిందని, దీని ప్రకారం వేయి బీడీలకు మొత్తం కూలీ రేటు 261.97పైసలు అవుతుందన్నారు. నెలసరి ఉద్యోగులకు నెలకు 312, బీడీ ప్యాకర్లకు రోజుకు 10రూపాయల 40 పైసల చొప్పున పెరిగిందన్నారు. పెరిగిన కరువు భత్యం రూపాయలను ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమలు చేయాలని డిమాండ్ చేశారు. యాజమాన్యాలు అలసత్వం ప్రదర్శిస్తే, కరువు భత్యం అమలు కోసం బీడీలు చుట్టే కార్మికులు నెలసరి జీతాల ఉద్యోగులు, బీడీ ప్యాకర్లు ఆందోళనకు సిద్ధం కావాలని బీడీ కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నరేందర్, ఉపాధ్యక్షులు కట్ల రాజన్న, రాష్ట్ర సహాయ కార్యదర్శి రాంప్రసాద్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు డి.రాజేశ్వర్, సిద్దిపేట జిల్లా అధ్యక్షులు శ్రీశైలం, జగిత్యాల జిల్లా బాధ్యులు భీమన్న తదితరులు పాల్గొన్నారు.

జీవవైవిధ్యం పరిరక్షణ కార్యశాల విజయవంతం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

స్థానిక గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలలో భౌతిక శాస్త్ర, వృక్షశాస్త్ర విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో నేడు జీవవైవిధ్యం పరిరక్షణ, పచ్చని పుడమికై తోడ్పాటు అనే అంశంపై ఒక రోజు కార్యశాలను స్వచ్ఛంద సంస్థ కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్, హైదరాబాద్ సౌజన్యంతో విజయవంతంగా నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ పి రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో జీవవైవిధ్య పరిరక్షణ, కనుమరుగైన జాతుల గురించి జియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా మాజీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ హరి సర్వోత్తమన్ ప్రసంగించారు. అలాగే పునరుత్పాదక శక్తి వనరుల గురించి ప్రజాపాలసీల ప్రముఖుడు డాక్టర్ దొంతి నరసింహారెడ్డి విస్తృత ఉపన్యాసం చేశారు. తదనంతరం జరిగిన చర్చలో సభికులు ఉత్సాహంగా అడిగిన అనేక సందేహాలకు ఓపికగా సమాధానాలు తెలియజేశారు. పర్యావరణ పరిరక్షణకై ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలగాలని, భావితరాలకు పచ్చని పుడమిని అందివ్వాలని నిర్వాహకులు డాక్టర్ టి.ఉమాకిరణ్, డాక్టర్ పి.రామకృష్ణ కోరారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రంగరత్నం, భరత్ రాజ్, రాజేష్, వినయ్, జయప్రసాద్, దండుస్వామి, చంద్రశేఖర్, నరేష్, గంగాధర్, గోపాల్, విజయ, పద్మ, వాణి, రాములు, నాగరాజు ఇతర అధ్యాపక బృందం అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

● డిఎల్‌పిఓ శ్రీనివాస్

నవతెలంగాణ-భిక్కనూర్

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని డిఎల్‌పిఓ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం మండలంలోని జంగంపల్లి గ్రామంలోని మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాలలోని తరగతి గదులు, వంటశాల, భోజనాన్ని పరిశీలించి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులకు సూచించారు. అనంతరం గ్రామంలోని పారిశుద్ధ పనులు, నర్సరీలోని మొక్కలను పరిశీలించి, వేసవి కాలాన్ని దష్టిలో ఉంచుకొని మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు పాటించాలని పంచాయతీ కార్యదర్శి బాబుకు తెలిపారు.



వంటశాలను పరిశీలిస్తున్న డిఎల్‌పిఓ శ్రీనివాస్

పట్టణ కేంద్రంలోని డివైడర్ సెంటర్‌లోని విద్యుత్ దీపాలు చెడిపోవడంతో పంచాయతీ కార్యదర్శి మహేష్‌గౌడ్ పంచాయతీ సిబ్బంది చేత బాగు చేయించారు. రామేశ్వర్‌పల్లి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఆవరణలో చెత్తాచెదారాన్ని పంచాయతీ సిబ్బంది చేత కార్యదర్శి శ్యాం శుభ్రం చేయించారు. అంతంపల్లి గ్రామంలో ఉపాధి హామీ పనులు, నర్సరీలోని మొక్కలను ఎంపీడీవో రాజ్ కిరణ్‌రెడ్డి పరిశీలించి ప్రతి ఒక్కరికి ఉపాధి హామీ పని కల్పించాలని పంచాయతీ కార్యదర్శి భార్గవికి తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

సకాలంలో రారు
సేవలందవు



వైద్యుల కోసం ఎదురుచూస్తున్న రోగులు

నవతెలంగాణ-తాడ్వాయి

మండలంలోని ఎర్రపాడు ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులు సకాలంలో విధులకు హాజరు కాక పోవడంతో రోగులు నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. నవతెలంగాణ మంగళవారం ఉదయం ఆస్పత్రికి వెళ్ళగా 10.30 గంటలకు వైద్య అధికరులు రాక పోవడంతో రోగులు వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పాడింది. ఇప్పటికైనా వైద్యాధికారులు సకాలంలో విధుల్లోకొచ్చి వైద్యం అందించేలా చూడాలని జిల్లా స్థాయి అధికారులను రోగులు కోరుతున్నారు.

తొలుత అర్హులైన దళితులకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలి

నవతెలంగాణ-సదాశివనగర్

నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇల్లు మొదటి విడతలో అధికంగా అర్హులైన దళిత కుటుంబాలకు కేటాయించాలని ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదనమోహన్‌కు ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షులు మద్దెల భాగయ్య కోరారు. మంగళవారం ఎమ్మెల్యేను కలిసి విన్నవించారు. ప్రతి గ్రామంలో ప్రతి తండా లో రోడ్లు బోర్లు వేయిస్తూ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను నియోజకవర్గంలో గ్రామాల్లో పల్లెల్లో తండాల్లో ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్తూ రానున్న స్థానిక ఎలక్షన్లో ప్రతి పల్లెలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరేసే విధంగా పనిచేస్తున్నట్టు తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-కామారెడ్డి



విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన

మండలంలోని అడ్లూరు గ్రామంలో జడ్పిహెచ్ఎస్ హైస్కూల్‌లో కళాబృందం ప్రోగ్రాం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో షీటీం, సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించారు. షీటీం నెం.8712686094, సైబర్ నేరాల పట్ల టోల్ ఫ్రీ నెంబర్ 1930కు కాల్ చేసి వినియోగించుకోవాలని తెలిపారు. అత్యవసర పరిస్థి తులలో టోల్ ఫ్రీ నెంబర్ 100, 108, 1930, 181ల గురించి తెలిపారు. ప్రతి మహిళ ఫోన్ నందు టి-సేఫ్ యాప్ డౌన్లోడ్ చేసుకోవాలని కోరారు. ఇది మహిళలకు చాలా అత్యవసరమైనదని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా రోడ్డు భద్రత నియమాలు పాటించాలని వారికి తెలిపారు. మారకద్రవ్యాల వినియోగాన్ని అందరూ మానుకోవాలని తెలియజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కళాబందం, భరోసా టీం కళాశాల హెడ్మాస్టర్ సుమలత, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలన

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో మధ్యాహ్న భోజనా న్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులను పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. మెను ప్రకారం భోజనం అందించాలని ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. ఎమ్మెల్యే మదన్మోహన్ ఆదేశానుసారం మధ్యాహ్నం భోజనం పరిశీలించినట్టు కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు రామచంద్రరెడ్డి, మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి, తాండూర్ సొసైటీ చైర్మన్ గంగారెడ్డి, సీనియర్ నాయకుడు నరసింహారెడ్డి, మండల మైనార్టీ అధ్యక్షుడు ఇమామ్, ఉపాధ్యక్షుడు లక్ష్మణ్ ఠాగూర్, గులాం, తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ ఆఫీసర్స్ నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-కామారెడ్డి

ఆర్‌బిఎస్‌కే రాష్ట్ర మెడికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. వరంగల్ పట్టణంలోని కాశీ బుగ్గలోని ఆసుపత్రిలో నిర్వహించిన కార్యక్రమం అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిటీ చైర్మన్ రవీందర్ మాట్లాడుతూ.. కామారెడ్డికి చెందిన ప్రముఖ హెూమియో వైద్యుడు డాక్టర్.పల్స హరీష్‌గౌడ్‌ని రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా, రాష్ట్ర అధ్యక్షుడుగా మోహన్రావు (వరంగల్ జిల్లా), ప్రధాన కార్యదర్శిగా బిజితో దుర్గాప్రసాద్ (హనుమకొండ జిల్లా), ప్రధాన కార్యదర్శిగా బండి శ్రీనివాస్ (భూపాలపల్లి జిల్లి) ఎన్నికయ్యారు. వీరితో పాటు 11 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్టు ఆయన ప్రకటించారు.

విద్యార్థులకు పరీక్ష అట్టలు, పెన్నులు అందజేత

నవతెలంగాణ-పిట్లం

మండలంలోని చిన్న కోడప్‌గల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష అట్టలు, పెన్నులు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ కిషన్ మాట్లాడుతూ.. పదవ తరగతి విద్యార్థులు పరీక్షల సమయంలో ఒత్తిడి, భయాందోళనకు గురి కాకుండా పరీక్షలను ప్రశాంతంగా రాయాలని సూచించారు. కార్యక్ర మంలో లయన్స్ అధ్యక్షులు కాశిరెడ్డి, కార్యదర్శి వేణుగోపాల్, కోశాధికారి బాలు, సభ్యులు నారాయణరెడ్డి, లక్ష్మీనారాయణ, రాజు సెట్, ఉపాధ్యాయ బందం, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-తాడ్వాయి

మండలంలోని ఆయా గ్రామాల్లో రోగుల కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంగళవారం పంపిణీ చేసినట్టు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జూకంటి వెంకటరెడ్డి అన్నారు. తాడ్వాయి, చిట్యాల, సంతాయి పేట్, నందివాడ, కనకల్, బ్రహ్మాజీ వాడి, చందాపూర్, సంఘజీవాడి, దేవయిపల్లి, తదితర గ్రామాలకు చెందిన 26 మంది కుటుంబాలకు రూ.10లక్షల 73వేలు విలువ గల ఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ఆదేశాల మేరకు పంపిణీ చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ నాయకులు బండారు సంజీవ్, అంబిర్ శ్యాం రావు, మేకల రాజు, గుట్టకాడి రంజిత్ రెడ్డి, మెట్టు రామచంద్రం ఈరమ్మళ్ళ నర్సింలు, సలీం, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలంలోని లింగంపల్లి గ్రామంలో పోతరాజు సాయికిరణ్‌కు మంజూరైన 60 వేల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును బాధితుని కుటుంబం వద్దకు వెళ్లి మంగళవారం అందజేసినట్టు పార్టీ గ్రామ అధ్యక్షులు శేఖర్ తెలిపారు. చెక్కు మంజూరు చేయించిన ఎమ్మెల్యేకు ,పార్టీ మండల అధ్యక్షులు బుర్ర నారాగౌడ్‌కు కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు శేఖర్, భాను చందర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎల్లమ్మకు బోనాల పండుగ

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలంలోని బోనాల గ్రామంలో మంగళవారం గౌడ కులస్తులు రేణుక ఎల్లమ్మకు బోనాల పండుగ నిర్వహించారు. గౌడ కులస్తులు ఇంటింటికి బోనాలను అలంకరించి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా డప్పుసప్పుడు నడుమ ఊరేగింపుగా తీసుకొచ్చి ప్రత్యేక పూజలు చేశారు.

గ్రామపంచాయతీకి పాడె వితరణ

నవతెలంగాణ-పిట్లం

మండలంలోని గౌరారం గ్రామపంచాయతీ మాజీ ఉపసర్పంచ్ కుర్మా సాయిలు వారి తమ్ముడు కుర్మా పండరి జ్ఞాపకార్థం గ్రామపంచాయతీ కార్యాలయానికి పాడెను మంగళవారం వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఎవరైనా చనిపోతే వారి అంతిమ సంస్కారాలకు గాను అవసరాల నిమిత్తం తన తమ్ముడు కుర్మా పండరి జ్ఞాపకార్థమునకు గాను 15 వేల రూపాయల విలువగల పాడెను అందజేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుర్మా నాగ్ గొండ, గ్రామ పెద్దలు హనుమంతరావు పటేల్, నాయకులు జూపాల శంకర్, దుంపల సాయిలు, కడాల సంతు, పెరుమల సంజీవులు లక్ష్మి, కడాల లక్ష్మి , పంచాయతీ సిబ్బంది అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమానికి 1,70,000 రూపాయల విరాళం

నవతెలంగాణ-తాడ్వాయి

మండల కేంద్రంలోని శబరిమాత ఆశ్రమానికి భక్తులు 1,70,000 రూపాయల విరాళం అందించినట్లు ట్రస్టు సభ్యులు మంగళవారం తెలిపారు. బసవ కళ్యాణం గ్రామానికి చెందిన మల్లికార్జున ఉల్కండే 51,000 రూపాయలు, బసవప్ప 75000 అందించారని, నాగరాజు 30000 అందించగా, శ్రీనివాస్ 10000 రూపాయలు , రాజు 13000 రూపాయలు విరాళంగా అందజేశారని ఈ నిధులను శబరిమాత ఆశ్రమంలో జరిగే శ్రీరామనవమి వేడుకలకు వచ్చే భక్తులకు అన్నదాన తదితర ఆలయ, అవసరాల కోసం వినియోగించనున్నట్లు ట్రస్టు సభ్యులు ముదాం నరసింహులు, ఏనుగు రాఘవరెడ్డి అంబీర్ బాలకిషన్ రావు, శంకరప్ప , పండరిలు తెలిపారు .

ఉపాధి పనులతో భూముల అభివృద్ధి



మాట్లాడుతున్న ఎంపీడీవో నరేష్

నవతెలంగాణ-లింగంపేట్

జాతీయ గ్రామీణ ఉపాధి ద్వారా కూలీలు చేపడుతున్నటువంటి పనులతో భూముల అభివృద్ధి చెందుతాయని ఎంపీడీవో నరేష్ సూచించారు. మంగళవారం లింగంపేట్ మండలంలోని ఎల్లారం గ్రామంలో జరుగుతున్నటువంటి ఉపాధి పనులను, నర్సరీలను పరిశీలించారు. సన్న చిన్న కారు రైతులు ఉపాధి హామీ ద్వారా కూలీలతో భూముల అభివృద్ధి చేసుకోవడం వల్ల రైతులకు ఖర్చులు తగ్గుతాయని భూముల అభివృద్ధి చెందుతాయని రైతు ఆర్థికంగా ఎదుగుతారని అన్నారు. పంటలకు సాగు చేసేందుకు భూములను ఎత్తు వంపులను సరి చేయడము గట్టులు పోయనున్నట్టు తెలిపారు.

ఎండలు తీవ్రం కావడంతో నర్సరీలో మొక్కలు వాడిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన క్షేత్ర సహాయకులకు సూచించారు. ఉపాధి పని ప్రదేశాల్లో కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీఓ మలహరి క్షేత్ర సహాయకులు సాయన్న గ్రామపంచాయతీ కార్యదర్శి కూలీలు ఉన్నారు.